
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
శనివారం 23 మార్చి 2024


రంజాన్ వేళలు
ఇఫ్తార్ | 6:34
శనివారం
సహర్ | 4:55
ఆదివారం

గుండె పోటుతో యాత్రికుడి మృతి

ధర్మపురి, మార్చి 22: ధర్మపురి గోదావరి నది వద్ద రటపు నరహరి (55) అనే యాత్రికుడు గుండె పోటుతో గురువారం రాత్రి మృతి చెందాడు. నిజామాబాద్ జిల్లా ముప్కాల్ మండలంలోని నాగంపేట గ్రామానికి చెందిన నరహరి దైవ దర్శనం కోసం ధర్మపురి వచ్చాడు. రాత్రి మంగళిగడ్డ స్నానఘట్టం వద్ద నిద్ర పోతుండగా గుండె పోటు వచ్చి మృతి చెందాడు. మృతుడి శవాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్సై ఉదయ్‌కుమార్ తెలిపారు.



నిఘా కట్టుదిట్టం

- రాజకీయ పార్టీల కదలికలపై ఆరా
- ముమ్మరంగా పోలీసుల తనిఖీలు
- రూ. 50 వేల నగదు మించితే సీజ్
- ఎన్నికల నేపథ్యంలో ఆరు బృందాల ఏర్పాటు
- రంగంలోకి యాక్షన్ టీంలు
- శుభకార్యాలపై 'కోడ్' ఎఫెక్ట్

జగిత్యాల, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు నిఘాను కట్టు దిట్టం చేశారు. రాజకీయ పార్టీల కదలికలపై నిఘాను ఉంచారు. జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో చెక్ పోస్టులను ఏ ర్పాటు చేసి నగదు, ఓటర్లను ప్రలోభాలకు గురి చేసేలా బహుమతులు తరలింపుపై 24 గంటల పాటు తనిఖీలు చేస్తున్నారు. ఎన్నికల నిర్వహణలో ఆది నుంచి తుది వరకు శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులు, ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేయడంలో రెవెన్యూ, ఎన్నికల అధికారుల పాత్ర కీలకంగా ఉంటుంది. ఎన్నికల ప్రవర్తన నియమావళిని అమలు చేస్తూ అదుపుతప్పితే నియంత్రించాల్సిన విధి కూడా ఈ శాఖలకు చెందిన అధికారులే ప్రధానంగా చేస్తుంటారు. ఈ నేపథ్యంలో జిల్లాలో ఎన్ని కల నిర్వహణకు పోలీసు, రెవెన్యూ శాఖలతో పాటు పలువురు ఎన్నికల అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు.

బూత్ లెవల్‌లో నిఘా..

ప్రతి పోలింగ్ బూత్ వద్ద ఎన్నికల అధికారులు, ఓటర్ల భద్రతకు సీఐ, ఎస్ఐ స్థాయి అధికారులతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి పోలింగ్ బూత్ పోలీస్ సీసీ కెమెరాలతో కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేస్తారు. తద్వారా బూత్ స్థాయిలో శాంతిభద్రతలపై ఎప్పటికప్పుడు నిర్దిష్ట అవగాహన ఏర్పడుతుంది. పోలింగ్ స్టేషన్లను ఎప్పటికప్పుడు తనిఖీ చేయడం, చుట్టు పక్కల ప్రాంతాల్లో రాజకీయ, శాంతి భద్రతల పరిస్థితిని గమనిస్తుండడం వంటివి చేస్తున్నారు.

యాప్‌లే కీలకం..

ఈ ఎన్నికల నిర్వహణలో పారదర్శకత, శాంతి భద్రతల పరిరక్షణ, స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా చూసేందుకు ఎన్నికల సంఘం సాంకేతికతకు పెద్దపీట వేసింది. ఎన్నికల ప్రకటన విడుదలైంది మొదలు, మొత్తం ప్రక్రియ పూర్తయ్యేంత వరకూ అనుమతిని, ఫిర్యాదుల నిర్వహణను సాంకేతికతతో ముడి పెట్టారు. పార్టీలు, అభ్యర్థులు... ఇలా ఎవరైనా ఎన్నికలకు సంబంధించిన ప్రచార అనుమతులు పొందేందుకు సువిధ యాప్‌ను వినియోగించుకోవాలి. యాప్‌లో అడిగిన వివరాలు పొందుపరిచి అనుమతులకు దరఖాస్తు చేసుకోవాలి.

ఇవి రిటర్నింగ్ అధికారికి చేరుతాయి. ఆయన సంబంధితశాఖలకు పంపి అనుమతులపై నిర్ణయం తీసుకుంటారు. తద్వారా ఈ మొత్తం ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహిస్తారు. అలాగే ఎన్నికల వేళ జరుగుతున్న నిబంధనల ఉల్లంఘన అసాంఘిక చర్యలు సంబంధిత ఇతర వివాదాలపై ఫిర్యాదు చేసేందుకు సీ-విజిల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇందులో ఫొటోలు, లొకేషన్లతో సహా సమస్యపై ఫిర్యాదు చేయవచ్చు. ఈ రెండు యాప్‌లు పూర్తిగా ఎన్నికల సంఘం పరిధిలోనే కొనసాగుతాయి.

ఇప్పటికే నగదు, మద్యం పట్టివేత...

ఈ నెల 16వ తేదీ నుంచి 22వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా రూ. 9.80 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా రూ. 1,87,500 విలువ గల 336 లీటర్ల లిక్కర్ స్వాధీనం చేసుకున్నారు. సోషల్ మీడియాపై నిఘా కోసం నిరంతరం ఐటీ సభ్యులతో కూడిన స్పెషల్ టీంలను ఏర్పాటు చేశారు. అనవసరమైన విద్వేషాలను రెచ్చగొట్టే పోస్టులు, ఎన్నికల నియమావళిని ఉల్లంఘించే, ఇతరులను కించపరిచే విధంగా ఉండే పోస్టులు పెట్టే వారిపై వేగవంతమైన చర్యలను తీసుకునేందుకు ఐటీ కోట్ టీం సభ్యులతో కూడిన ప్రత్యేక బృందాలను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేశారు.


వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

తుపాకులు స్వాధీనం...

జిల్లాలో అనుమతి పొంది తుపాకులను కలిగిఉన్న వ్యక్తులను పోలీసు అధికారులు గుర్తించారు. జిల్లా వ్యాప్తంగా 45 మంది తుపాకులు ఇప్పటికే సంబంధిత వ్యక్తులకు తుపాకులు డిపాజిట్ చేయాల్సిందని సూచిస్తూ నోటీసులు అందించారు. పలువురు ఆయా పోలీస్ స్టేషన్లలో ఆయుధాలను డిపాజిట్ చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. వీటిని తిరిగి కౌంటింగ్ పూర్తయిన తర్వాత తిరిగి అప్పగిస్తారు.

ఎన్నికల ప్రవర్తన నియమావళి పక్కాగా అమలు

షేక్ యాస్మిన్ బాషా, జిల్లా కలెక్టర్



జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళిని పక్కాగా అమలు చేస్తున్నాము. ఇప్పటికే ఇందుకు అవసరమైన ప్రత్యేక అధికార బృందాలను ఏర్పాటు చేశాము. ఎప్పటికప్పుడు సంబంధిత బృందాలు పర్యవేక్షణ చేస్తున్నాయి. ఎ న్నికలను సక్రమంగా నిర్వహించడానికి రాజకీయ పార్టీలు, ప్రజలు సహకరించాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ ఎన్నికల ప్రవర్తన నియమావళిని పాటించాలి.

పటిష్టమైన ప్రణాళికతో ఎన్నికల నిర్వహణ

సన్ ప్రీత్ సింగ్, ఎస్పీ



పార్లమెంట్ ఎన్నికలను పటిష్టమైన ప్రణాళికతో నిర్వహించడానికి అవసరమైన చర్యలు చేపట్టాము. ఇప్పటికే పలు జిల్లా సరిహద్దుల ప్రాంతాల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేశాము. విస్తృతంగా వాహన తనిఖీలు చేస్తున్నాము. శాంతి భద్రతలను పర్యవేక్షించడంతో ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రకారం ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా దృష్టి సారిస్తున్నాము.

పాత నేరస్థులు...రౌడీషీటర్ల బైండోవర్‌పై దృష్టి...

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు పలువురు రౌడీ షీటర్లను బైండోవర్ చేయడంపై పోలీసులు దృష్టి సారించారు. గత ఎన్నికల్లో వివాదాలకు కారకులైన వారు, రాజకీయ వివాదాలు, ఘర్షణలో కీలకంగా వ్యవహరిస్తున్న వ్యక్తులను బైండోవర్ చేసి, ప్రత్యేక నిఘా కొనసాగించడంపై దృష్టి సారించారు.

కౌంటింగ్ పూర్తయ్యేయ వరకూ...


పోలింగ్ పూర్తవడంతోనే నిబంధనల సడలింపు జరగదని, కౌం టింగ్ పూర్తయ్యే వరకూ ఇదే నియమావళి కొనసాగుతుందని అధికారులు అంటున్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదని. ప్రచారాలు, ర్యాలీలు, సభల నిర్వహణకు ఎన్నికల సంఘం అనుమతి పొందాలనుకునే వారు 48 గంటల ముందే అనుమతి తీసుకోవాలని సూ చిస్తున్నారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రజలు, పా ర్టీలు సహకరించాలని అధికారులు కోరుతున్నారు.

ఫిర్యాదుల కోసం...

ఫిర్యాదుల కోసం ప్రత్యేకంగా ఫోన్ నంబర్లు కేటాయించారు. యాప్‌లను వినియోగించుకోలేని వారు ఈ నంబర్లకు ఫోన్ చేసి ఎన్నికలకు సంబంధించిన తమ సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చని అధికారులు సూచిస్తున్నారు. అలాగే నిబంధనల ఉల్లంఘనను అధికారుల దృష్టికి తీసుకొని వెళ్లవచ్చని ప్రచారం నిర్వహిస్తున్నారు. ఎలక్షన్ కంట్రోల్ రూమ్ (24 గంటలు) 18004257620 కలెక్టరేట్ ఎలక్షన్ సెల్ కంట్రోల్ రూమ్‌కు కాల్ చేయాలని సూచిస్తున్నారు. 1950 హెల్ప్‌లైన్, 100 నంబర్లకు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని కోరుతున్నారు.

శుభకార్యాలపై కోడ్ ఎఫెక్ట్...

లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో ఆంక్షలు శుభకార్యాలపై ప్రభావం చూపు తున్నాయి. ప్రస్తుతం శుభ ముహూర్తాలు ఉన్నందున పలువురు పలు శుభకార్యాలు చేసుకుంటున్నారు. వివాహాల సందర్భంలో నూతన వస్త్రాలు, బంగారం, ఇతర వస్తువులు కొనుగోలు చేయడం, అవసరమైన నిత్యావసర వస్తువులు, వాహనాలు, ఇతర సామగ్రి కొనుగోలు చేయడం వంటివి చేస్తుంటారు. ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్నందున కోడ్ అమలులో ఉండడం వల్ల రూ. 50 వేలకు మించి నగదు తీసుకువెళ్తే సీజ్ చేస్తుం డడం ఇబ్బందిగా మారిందని పలువురు వాపోతున్నారు.



నగదు, బహుమతులపై నిఘా..

తనిఖీ అధికారులకు ఎవరైనా రూ. 50 వేలకు మించి నగదుతో పట్టుబడితే దానికి తగిన ఆధారాలు చూపాలి. అనుమానం వచ్చినా, తగిన పత్రాలు లేక పోయినా మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ టీమ్ (ఎంసీసీ), ఫ్ల యింగ్ స్క్వాడ్ టీమ్ (ఎఫ్ఎస్‌టీ), స్టాటిక్ సర్వైలెన్స్ టీములు (ఎస్ఎస్‌టీ) సంయుక్తంగా తనిఖీ చేసి పట్టుబడిన నగదును, బంగారం, బహుమతు లను సీజ్ చేస్తాయి. వీటిని ఎన్నికల అధికారి సమక్షంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక టీముకు సాధీనం చేస్తారు. వీటి విడుదలపై అక్కడ గ్రీవెన్స్ కమిటీ రెండు రోజుల్లోపే నిర్ణయం తీసుకుంటుంది. మెట్‌పల్లి ఆర్డీవో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అధికారిగా కొనసాగుతూ ఎప్పటికప్పుడు పర్యవేక్షణ జరుపుతు న్నారు. మీడియా సర్టిఫికెట్ మానిటరింగ్ కమిటీ ద్వారా ఎప్పటికప్పుడు ప్రచారాలపై నిఘాను ఉంచుతున్నారు.

వాహనాలపై స్టిక్కర్లు తప్పనిసరి..

ప్రచార వాహనాలకు అనుమతి పత్రాలు లేదా స్టిక్కర్లు తప్పనిసరిగా అతికించాలి. వాటిని వాహనంలో ఉంచి అడిగితే చూపిద్దాంలే అన్న ధోరణి ఉండవద్దని సూచిస్తున్నారు. ఈ స్టిక్కర్లు అతికించని వాహన చోదకులపై చట్ట పరంగా చర్యలు తీసుకుంటారు. ప్రచార వాహనాలతో పాటు వచ్చే జనంపై ఎంతమంది అనే అంశంపై కూడా స్పష్టత ఉండాలి. ఎన్నికల సంఘం అనుమతులు లేకుండా గుంపులుగా ప్రచారాలు, సభలు, ర్యాలీలు నిర్వహించకూడదు. లౌడ్ స్పీకర్ల వినియోగానికి కూడా అనుమతి తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుంది. ఎన్నికల షెడ్యూల్ విడుదల అయిన నేపథ్యంలో ప్రత్యేక పరిస్థితి అమలులో ఉన్నందున నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటారు. వాహనాలు కూడా సీజ్ చేస్తారు.

జిల్లా సరిహద్దుల్లో చెక్ పోస్టుల ఏర్పాటు...

జిల్లా సరిహద్దుల్లో ఉన్న ఇబ్రహీంపట్నం మండలం గండి హనుమాన్, మల్లాపూర్ మండలం ఒబులాపూర్, బీర్‌పూర్ మండలం కమ్మునూరు, కొడిమ్యాల మండలం దొంగల మర్రి, కథలాపూర్ మండలం కలికోట, ధర్మపురి మండలం రాయపట్నం, రాయికల్ మండలంలోని బోర్నపల్లి ప్రాంతాల్లో పోలీసులు చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు. అంతేకాకుండా మొబైల్ చెక్ పోస్టుల ఏర్పాటు, సర్‌ప్రైజ్ వెహికల్ చెకింగ్ నాక బంది వంటి కార్యక్రమాలను నిర్వహించడంపై దృష్టి సారించారు. ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులు పర్యవేక్షణ జరుపుతూ వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. 18 ఫ్లయింగ్ స్క్వాడ్, 19 స్టాటిస్టిక్ స్క్వాడ్ బృందాలు, 18 మోడల్ కోడ్ అధికారులు, 6 వీడియో వీవింగ్ టీమ్‌లు, 91 సెక్టరల్ అధికారులను నియమించి పర్యవేక్ష ణ జరుపుతున్నారు.

ధర్మపురి బార్ అసోసియేషన్ కార్యవర్గం ఏర్పాటు

ధర్మపురి, మార్చి 22: ధర్మపురి బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా రౌతు రాజేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు బార్ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం సమావేశం నిర్వహించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. వైస్ ప్రెసిడెంట్‌గా రామడుగు రాజేష్, జనరల్ సెక్రటరీగా బందెల రమేష్, జాయింట్ సెక్రటరీ గా మామిడాల శ్రీకాంత్‌కుమార్, ట్రెజరరీగా జాజాల రమేష్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్‌గా బత్తిని ఇంద్రకరణ్‌ను ఎన్నుకున్నారు. సీనియర్ ఈసీ మెంబర్స్‌గా గడ్డం సత్య నారాయణరెడ్డి, అలుక వినోద్‌కుమార్, లైబ్రరీ సెక్రటరీగా గూడ జితేందర్‌రెడ్డి, లేడీ రిప్రజెంటేటివ్‌గా కరవత్తుల భావన ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గం ప్రమాణ స్వీ కారం చేసిన అనంతరం వారందరిని జూనియర్ సివిల్ జడ్జి శ్యాంప్రసాద్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి. రాజేష్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది బెత్తపు లక్ష్మణ్, గడ్డం లింగారెడ్డి, దుమ్మెన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నరసింహునికి రెండు హుండీలు బహూకరణ

ధర్మపురి, మార్చి 22: ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయానికి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డీజీఎం శంకర్ హేంబ్ర రెండు హుండీలు శుక్రవారం బహూకరించారు. ఈ హుండీ విలువ రూ 80,000 ఉంటుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆలయం పక్షాన ఆయనను స్వామి శేషవస్త్రం, చిత్రపటం బహూకరించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఉత్సవ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్, యుబీఐ జగిత్యాల లీడ్ బ్యాంక్ మేనేజర్ పొన్న వెంకటరెడ్డి ధర్మపురి బ్రాంచ్ మేనేజర్ రవితేజ, ముఖ్య అర్చకులు సీహెచ్ రమణయ్య, అర్చకులు సముద్రాల వంశీ, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, సభ్యులు రాపర్తి సాయికిరణ్ పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

- ఎస్పీ సన్ ప్రీత్ సింగ్
- పెగడపల్లి పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ


పెగడపల్లి పోలీస్‌స్టేషన్ పరిసరాలు పరిశీలిస్తున్న ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్

పెగడపల్లి, మార్చి 22 : జిల్లాలో పోలీసులు ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ప్రజా ఫిర్యాదులలో జాప్యం చేయకుండా తక్షణమే స్పందించాలని ఎస్పీ సన్ ప్రత్ సింగ్ పేర్కొన్నారు. శుక్రవారం పెగడపల్లి పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను, రిసెప్షన్, స్టేషన్ రైటర్, ఎస్‌హెచ్‌వో, రెస్ట్ రూమ్, 5ఎస్ అమలు తీరును, వారు ఏఏ విధులు నిర్వహిస్తున్నారో పరిశీలించారు. త్వరలో జరుగనున్న లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ప్రశాంత వాతావరణంలో న్నికల నిర్వహణకు ఫ్లాగ్ మార్చ్, రూట్ మార్చ్‌లు నిర్వహించి ప్రజలకు భద్రతా భావం కల్పించాలని సూచించారు. సిబ్బంది దగ్గర తమకు కేటాయించిన గ్రామాల పూర్తి స్థాయి సమాచారం ఉండాలని, ప్రజలకు ఎళ్లప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలు ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలన్నారు. స్టేషన్ పరిధిలో నేరస్థులు, రౌడీ షీటర్లు గూర్చి తెలుసుకుని ఎన్నికల సమయంలో వారిపై ప్రత్యేక నిఘా పెట్టాలని, సంబంధిత అధికారుల ఎదుట బైండోవర్ చేయాలని, వారి కదలికలపై నిఘా ఉంచాలని, ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని అలసత్వం ప్రదర్శిస్తే శాఖాపరంగా చర్యలు తప్పవని ఎస్పీ పేర్కొన్నారు. కార్యక్రమంలో మల్యాల సీఐ రవి, పెగడపల్లి ఎస్.ఐ రామకృష్ణ ఉన్నారు.

వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలి

అడిషనల్ ఎస్పీ వినోద్‌కుమార్

కొడిమ్యాల, మార్చి 22 : చెక్ పోస్ల వద్ద వాహనాలను పోలీస్ సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీ చేయాలని అడిషనల్ ఎస్పీ వినోద్ కుమార్ అన్నారు. శుక్రవారం కరీంనగర్-జగిత్యాల ప్రధాన రహదారిపై ఉన్న మండలంలోని దొంగలమర్రి పోలీస్ చెక్ పోస్ట్‌ను అడిషనల్ ఎస్పీ అకస్మికంగా తనిఖీ చేశారు. ఎన్నికలను సజావుగా నిర్వహించడానికి చెక్ పోస్ట్‌లు కీలక పాత్ర వహిస్తాయన్నారు. జిల్లా సరిహద్దులో ఏర్పాటు చేసిన చెక్ నిరంతరం వాహనాల తనిఖీలు సిబ్బంది చేస్తున్నట్లు తెలిపారు. అక్రమ మార్గంలో ఎటువంటి మద్యం, డబ్బు, ప్రజలను ప్రలోభాలకు గురిచేసె వస్తువులు జిల్లాకు రాకుండా వివిద శాఖల సమన్వయంతో చెక్ పోస్ల పర్యవేక్షణ జరుగుతుందన్నారు. అనంతరం వాహనాల నమోదు రిజిస్టర్‌ను పరిశీలించారు. వాహనాలు తనిఖీ చేయు సమయంలో పోలీస్ అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. ఈ తనిఖీ సమయంలో కొడిమ్యాల ఎస్సై సందీప్, సిబ్బంది ఉన్నారు.

లారీ ఢీకొని గాయాలు

మల్యాల, మార్చి 22: కరీంనగర్-జగిత్యాల మార్గంలోని మారుతీ టౌన్‌షిప్ ప్రాంతంలో నడుచుకుంటు వెలుతున్న ఓ వ్యక్తిని లారీ ఢీకొనడంతో గా యాలపాలయ్యాడు. దీంతో గాయపడిన వ్యక్తిని చికిత్స కోసం పోలీసులు ఆసుపత్రికి తరలించారు. లారీని మల్యాల పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ధర్మపురిలో జిల్లా అడిషనల్ ఎస్పీ పూజలు

ధర్మపురి, మార్చి 22: ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయాన్ని జిల్లా అడిషనల్ ఎస్పీ వినోద్‌కుమార్ శుక్రవారం సందర్శించారు. ఆలయం సాంప్రదాయం ప్రకారం అర్చకులు, సిబ్బంది ఆయనకు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. అనంతరం స్వామి సన్నిధిలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య ముఖ్య అర్చకులు రమణయ్య, అర్చకులు వంశీకృష్ణ ఆయనను ఘనంగా ఆశీర్వదించారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఆయనకు స్వామి శేష వస్త్రం, ప్రసాదాలు, చిత్రపటం బహూకరించారు. ఆయన అనుబంధ ఆలయాలను, అద్దాల మండపాన్ని కూడ సందర్శించారు. అంతకు ముందు యమ ధర్మరాజు ఆలయం వద్ద గండ దీపంలో నూనె పోసి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. అడిషనల్ ఎస్పీ వినోద్‌కుమార్ రాయపట్నం వద్ద పోలీస్ చెక్ పోస్ట్‌ను తనిఖీ చేశారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్ఐలు ఉదయ్‌కుమార్, శ్రీధర్‌రెడ్డి, ఆలయ సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో భారీగా చేరికలు

జగిత్యాల, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీలో చేరికలు కార్యక్రమం శుక్రవారం కొనసాగింది. సారంగాపూర్ మండల ఎంపీపీ కోల జమున శ్రీనివాస్, జగిత్యాల అర్బన్ మండలం గోపాల్‌రావు పేట గ్రామానికి చెందిన దావ తిరుపతి ఆధ్వర్యంలో 50 మంది యువకులు, జగిత్యాల రూరల్ మండలం పెరికపల్లి గ్రామానికి చెందిన నాయకులు, తిప్పన్నపేట ఉప సర్పంచ్ బొడ్డు బుచ్చన్నతో పాటు 50 మంది నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఇందిరా భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఆధ్వర్యంలో కండువాలు కప్పి పార్టీలోకి చేర్చుకున్నారు. రానున్న ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాంచంద్రా రెడ్డి, ఆకుల జమున రాజిరెడ్డి, రాజన్న, రవి, సుధాకర్, లక్ష్మీనారాయణ, రమణ ఉన్నారు.

రాములవారి కల్యాణానికి ఏర్పాట్లు చేయాలి

రాయికల్, మార్చి 22: రాబోయే శ్రీరామ నవమి రోజున శ్రీరాముల వారి కల్యాణానికి భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్సీ టి.జీవన్ రెడ్డి సూచించారు. మండలంలోని అయోధ్య గ్రామంలోని రామాలయాన్ని పరిశీలించారు. స్వామివారి కల్యాణానికి ఎక్కువ సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ఏర్పాట్లు చేయాలని అన్నారు. అలాగే అయోధ్య రామాల యానికి రూ.20 లక్షల నిధులతో ఆలయంలో ఫ్లోరింగ్, ఆలయం ఎదుట సీసీ రోడ్డు పనులను పూర్తి చేయగా పరిశీలించారు.

పారిశుధ్య పనులను మెరుగు పరచాలి

మున్సిపల్ చైర్ పర్సన్ జ్యోతి

జగిత్యాల టౌన్, మార్చి 22 : జగిత్యాల పట్టణంలో పారిశుధ్య పనులను మరింత మెరుగు పరచాల్సిన బాధ్యత శానిటేషన్ అధికారులదేనని మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి అ న్నారు. పట్టణంలోని 25వ వార్డులో చైర్ పర్సన్ శుక్రవారం ప ర్యటించారు. 25వ వార్డులో ప్రధాన సమస్యగా మారిన డ్రేనేజీని పరిశీలించారు. అనంతరం వార్డు ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సిరికొండ పద్మ, కాంగ్రెస్ నాయకుడు తొపారపు రజనీకాంత్, అడువాల లక్ష్మణ్ ఉన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

భీమారం, మార్చి 22: పేదల సంక్షేమ ప్రభుత్వమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. భీమారం మండల కేంద్రంలో శుక్రవారం గ్రామస్థులతో సమావేశమై ప్రజా సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ గత ఎన్నికల్లో తన విజయానికి కృషి చేసినవారికి రుణపడి ఉంటానని అన్నారు. భీమారంలో నూతన విద్యుత్ సబ్‌స్టేషన్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పల్లె దవాఖానా, మోత్కురావుపేట-చందురిత రోడ్డు, ఎన్‌డీఎఫ్ నిధుల పనితీరు, అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధి, కలిగోట సూరమ్మ కుడి-ఎడమ కాలువల కార్యాచరణ, తాగు,సాగునీటి సమస్యలపై చర్చించారు సూరమ్మ ప్రాజెక్ట్ నిర్మాణం తన కళ అని, ఖచ్చితంగా పూర్తి చేసి తీరుతామని అన్నారు. ఈ విషయంపై సీఎం రేవంత్ రెడ్డితో పలు దఫాలుగా చర్చించినట్లు ఆది శ్రీని వాస్ తెలిపారు. గత పాలకులు ఎమ్మెల్యే అనే పదాన్ని అలంకారంగానే వా డుకున్నారు తప్ప ప్రజలను ఏనాడూ పట్టించుకోలేదని అన్నారు. మేడిపల్లి- భీమారం మండలాల సమస్యలపై తనకు పూర్తి అవగాహన ఉందని, వా టికి అనుగుణంగా కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

ధర్మారంలో రోడ్డు ప్రమాదం

● ఇద్దరికి గాయాలు

కోనరావుపేట, మార్చి 22 : రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం ధర్మారం గ్రామంలో బైక్‌పై కూర్చున్న వ్యక్తిని మరో వాహన దారుడు ఢీకొట్టడంతో ఇద్దరికీ తీవ్రగాయాలయ్యాయి. దీంతో వీరిని సిరిసిల్ల ఏరియా హాస్పిటల్‌కు తరలించారు. స్థానికుల కథనం ప్రకారం.. కోనరావుపేట మండలం మల్కపేట గ్రామంలో పనిచేస్తున్న వలస కూలి రాంబాబు ధర్మారం గ్రామంలోని ఆన్‌లైన్ సెంటర్ వద్ద ఆగి ఉన్న బైక్‌పై కూర్చున్నాడు. తంగళ్లపల్లి మండలం అంకిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి బైక్‌పై వెళ్తూ ఆగి ఉన్న బైక్‌ను ఢీకొట్టడంతో ఇద్దరూ కిందపడిపోయారు. వారికి తీవ్ర గాయాలు కావడంతో సిరిసిల్ల ఆస్పత్రికి తరలించారు.

బ్రహ్మోత్సవాలకు పెరిగిన రద్దీ

- గోదావరి నదిలో పుణ్య స్నానాలు - రాత్రి స్వామి వారల సేవ ఊరేగింపు


పుర వీధుల్లో ఊరేగింపు నిర్వహిస్తున్న స్వామి వారల సేవలు

ధర్మపురి, మార్చి 22: బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ధర్మపురి క్షేత్రంలో శుక్రవారం భక్తుల రద్దీ పెరిగింది. లక్ష్మీనరసింహస్వామి, అనుబంధ ఆలయాలు భక్తులతో కిట కిటలాడాయి. సుదూర ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు గోదావరి నదిలో స్నానాలు ఆచరించారు. అనంతరం లక్ష్మీనరసింహ స్వామి, అ నుబంధ ఆలయాలకు చేరుకున్నారు. అనంతరం వెంట తెచ్చుకున్న కట్న కానుకలు, అమ్మ వారలకు ఒడి బియ్యం సమర్పించారు. కోడె మొక్కులు, వల్లు బండ వద్ద మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయం పక్షాన దాతల సహకారంతో సుమారు 7 వేల మంది భక్తులకు అన్న దానం చేశారు. ఆలయ ఈవో సంక టాల శ్రీనివాస్, ఉత్సవ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్ పర్యవేక్షణలో కమిటీ సభ్యులు సేవలు అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ, సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్‌ఐ ఉదయ్‌కుమార్, ఆర్యవైశ్య సంఘం కోశాధికారి రంగశం కరయ్య, సత్రం కోశాధికారి జక్కు దేవేందర్, ఇనుగంటి వేంకటేశ్వర్‌రావు, గునిశెట్టి రవీందర్, సత్తయ్య, మహేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు

సర్వ దేవతా హోమం..

బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని లక్ష్మీనృసింహస్వామి, అనుబంధ ఆలయాల్లో నిత్య పూజలు, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహిం చారు. ఆలయ ఆలయ వేదపండితులు బొజ్జ రమేశ్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య ప్రత్యేక పూజలు, హారతి, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలతో పాటు సర్వ దేవతా, శాంతి హోమాలు నిర్వహించారు.

స్వామి వారల సేవ ఊరేగింపు..

బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని రాత్రి వేళలో శ్రీ స్వామి లక్ష్మీ నరసింహస్వామి వారల సేవలను అశ్వ వాహనంపై ఊరేగించారు.


మొక్కులు చెల్లించుకునేందుకు క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

స్వామి వారల సేవలు పుర వీధుల గుండా ఇసుక స్తంభంవద్దకు తీసుకు వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దారి పొడవుగా మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికి దర్శనం చేసుకున్నారు. తిరిగి స్వామి వారల సేవలను ఆలయానికి తీసుక వెళ్లారు. కాగా బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆలయానికి రెండో రూ 4,16,455 ఆదాయం లభించినట్లు ఈవో సంకటాల శ్రీనివాస్ తెలిపారు. ఇందులో స్వామి వారల వివిధ రకాల పూజల టికెట్ల విక్రయం ద్వారా 2,29,216, ప్రసాదాలు విక్రయం ద్వారా రూ 1,23,000 లభించగా, అన్నదానం కోసం భక్తులు, దాతల ద్వారా సేకరించిన రూ 64,439 విరాళాలు ఉన్నట్లు ఆయన వివరించారు

బ్రహ్మోత్సవాల్లో నేడు..

బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శనివారం రాత్రి 7 గంటలకు శ్రీ వేంకటేశ్వరస్వామి ఊరేగింపు సేవ ఉంటుంది. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా స్థానిక శేషప్ప కళావేదికపై రాత్రి ఉషాగాయత్రి కూచిపూడి నృత్యప్రదర్శన ఉంటుందని, రాత్రి 7-30 గంటల నుంచి భక్తి సంగీత విభావరి, నృత్య ప్రదర్శన కార్యక్రమాలు ఉంటాయని ఈవో తెలిపారు.


ధర్మపురి గోదావరి నది వద్ద భక్తుల సందడి

ఆకట్టుకున్న భక్తి సంగీత విభావరి


ధర్మపురి శేషప్ప కళావేదికపై కచేరి నిర్వహిస్తున్న కళాకారులు

ధర్మపురి: ధర్మపురి క్షేత్రంలోని శేషప్ప కళా వేదికపై శుక్రవారం రాత్రి కళాకారులచే నిర్వహించిన భక్తి సంగీతం భక్తులను ఆకట్టుకుంది. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శేషప్ప కళావేదికపై స్థానిక కళాకారులు జి శంకర్‌శర్మ, ఎస్ రామకిష్టయ్య, కె విశ్వనాథం, పి చంద్రమౌళి, జె నర్సయ్య, కె. శంకర్, కె దత్తాత్రి పాడిన భక్తి సంగీత పాటలు ఆకట్టుకున్నాయి. అలాగే గర్షకుర్తికి చెందిన శశికళ, రాజమల్లయ్య బృందంచే భక్తి సంగీత విభావరి, మంచిర్యాల నందిని నృత్యాలయంచే కూచిపూరి నృత్య ప్రదర్శన అలరించింది. హైదరాబాద్ సరస్వతి సంగీత నృత్య శిక్షణాలయం ప్రతిమ శశిధర్‌చే భక్తి సంగీత విభావరి అలరించింది. కళాకారులకు ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఉత్సవ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్ శాలువా కప్పి సన్మానించారు. ప్రోగ్రాం ఇన్‌చార్జిగా ఎస్ఎల్ఎన్ నాట్యమండలి కార్యదర్శి కొరిడె నరహరి, పక్క వాద్య కళాకారులుగా రామయ్యశర్మ (కీబోర్డు), ఎస్ వేణుగోపాల్ (మృదంగం), రమేశ్ (తబలా), శ్రీధర్ (కీబోర్డు), రాజేశం (మృదంగం, తబలా, మోర్‌సింగ్), సుదర్శనా చార్యులు (మృదంగం), రవీందర్ (ఫ్లూట్), సంతోష్ (మృదంగం), ప్రవీణ్ (కీబోర్డు), అరుణ్ (తబల) వ్యవహరించారు.

మహిళ దారుణ హత్య

- రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని అనంతనగర్‌లో ఘటన


సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న టౌన్ సీఐ రఘుపతి

సిరిసిల్ల క్రైం, మార్చి 22: రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని అనంతనగర్‌లో మహిళ దారుణ హత్యకు గురైంది. శుక్రవారం వెలుగు చూసిన ఘటన వివరాలను సిరిసిల్ల టౌన్ సీఐ రఘుపతి వెల్లడించారు. బీహార్‌కు చెందిన ఆరుగురు కార్మికులు సిరిసిల్ల పట్టణంలోని అనంతనగర్‌లో ఓ అద్దె ఇంట్లో నివాసం ఉంటూ కూలీ పనులు చేస్తున్నారు. మూడు రోజులుగా ఆ ఇంటి తలుపులు తెరవడం లేదు. గది నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఇంటి తాళం పగలగొట్టి చూడగా రక్తపు మడుగులో మహిళ మృతదేహం పడి ఉంది. తల వెనుక భాగంలో పదునైన ఆయుదంతో దాడి చేశారు. మృతదేహాన్ని పరిశీలించి న పోలీ సులు వేములవాడ అర్బన్ మండలం కొడుముంజ గ్రామానికి చెందిన అలకుంట రమ (41)గా గుర్తించారు. కొడుముంజకు చెందిన రమ భర్త రాజయ్య మూడేళ్ల క్రితం అనారోగ్యంతో చనిపోయాడు. దీంతో కూలీ పనిచేస్తూ జీవనం సాగిస్తోంది. భవన నిర్మాణ పనుల కోసం ప్రతీ రోజు కొడుముంజ నుంచి సిరిసిల్ల లేబర్ అడ్డాకు వచ్చి కూలీ పనికి వెళ్తుంది. ఇదే క్రమంలో బీహార్‌కు చెందిన కార్మికులతో పరిచయం ఏర్పడినట్లు, వారితో పనికి వెళ్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో అద్దె ఇంటికి తీసుకెళ్లిన కార్మికులు మద్యం తాగి ఆమెపై అత్యాచారం చేసేందుకు యత్నించగా ఎదురు తిరగడంతో హత్య చేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కాకతీయ కాలువకు కొనసాగుతున్న నీటి విడుదల

జగిత్యాల, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు నీటి విడుదల శుక్రవారం కొనసాగింది. యాసంగి పంట సాగునీటి కో సం ఎస్సారెస్పీ అధికారులు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువ ద్వారా 3,500 క్యూసెక్కుల నీరు సరఫరా అవుతోంది. ప్రస్తుతం డ్యామ్‌లో 18.715 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టు నుంచి 5,396 క్యూసెక్కుల నీరు విడుదల అవుతోంది. ఇందులో కాకతీయ కాలువకు 3,500, లక్ష్మీ కాలువకు 200 క్యూసెక్కులు, అల్లిసాగర్ ఎత్తిపోతల పథకా నికి 347 క్యూసెక్కులు, గుత్పా ఎత్తిపోతల పథకానికి 146 క్యూసెక్కులు, సరస్వతి కాలువకు 300 క్యూసెక్కులు, మిషన్ భగీరథ పథకాలకు 231 క్యూసెక్కుల నీరు విడుదల అవుతోంది.

క్రీడలతో స్నేహ సంబంధాలు

మానకొండూర్, మార్చి 22: క్రీడలు యువత మధ్య స్నేహ సంబంధాలు పెంచుతాయని మానకొండూర్ సీఐ రాజ్‌కుమార్ అన్నారు. మండలంలోని అన్నారం గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మెమోరియల్ 17వ ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ టోర్నమెంట్‌లో 40 జట్లు పాల్గొంటున్నాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు బొట్ల కిషన్, మాజీ ఉపసర్పంచు మూగల మహేందర్‌రెడ్డి, నిర్వాహకులు పాశాల శంకర్, గ్రామస్థులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

పుస్తెల తాడు అపహరణ

వెల్గటూర్, మార్చి 22: మండల కేంద్రంలో శుక్రవారం తెల్లవారు జామున ఓ వృద్ధురాలి మెడలో నుంచి దుండగుడు పుస్తెల తాడు అపహరించిన సంఘటన కలకలం రేపింది. బాధితురాలు గుమ్ముల నర్సమ్మ తెలిపిన వివరాల ప్రకారం తెల్లవారు జామున కాలకృత్యాలు తీర్చుకోవడానికి ఆరు బయటికి వెళ్లింది. ఈ క్రమంలో వెనుక నుంచి వచ్చిన దుండగుడు ఆమె మెడలోని పుస్తెల తాడు అపహరించడానికి ప్రయత్నించాడు. ఈ సంఘటనతో తేరుకున్న వృద్ధురాలు ఆ దుండగుడితో కాసేపు పెనుగులాడింది. ఈ క్రమంలో పెస్తెల తాడు తెగిపో యింది. రెండు తులాల పుస్తెల తాడు లాక్కొని దుండగుడు పరార య్యాడు. తెల్లవారు జాము కావడంతో ఎవరూ బయట లేకపోవడంతో అరిచినప్పటికీ లాభం లేకపోయింది. ముఖానికి దస్తీ కట్టుకోవడం దానికి తోడు చీకటిగా ఉండడంతో దుండగుని ముఖం గుర్తించలేదని వృద్ధురాలు రోదిస్తూ చెప్పింది. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై ఉమాసాగర్ డాగ్ స్క్వాడ్ బృందంతో గాలింపు చేపట్టారు.



గాలిస్తున్న డాగ్ స్క్వాడ్ బృందం

బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్‌పై విద్యార్థులకు అవగాహన

కరీంనగర్ టౌన్, మార్చి 22: నగరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (కార్ఖానగడ్డ)లో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. శుక్రవారం వినియోగదారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు అంబురాథోడ్, బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ (బీఐఎస్) సభ్యులు జయశ్రీ, ఫోరం జిల్లా అధ్యక్షుడు జీవన్ పాల్గొని విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. వస్తువులు, ఉత్పత్తులు, ఆహారం, నీరు, తూనికలు, కల్తీ వాటిపై చర్చించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బీఐఎస్ అవగాహనపై పరీక్ష నిర్వహించి ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థి విజేతలకు 1000,750,500,250 రూపాయల నగదు బహుమతు లను అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్ సత్యనారాయణ చారి, ఉపాధ్యాయురాలు త్రివేణి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వడదెబ్బతో రైతు మృతి

మానకొండూర్, మార్చి 22: మండలంలోని పెద్దూరుపల్లి గ్రామంలో పంది జగన్(55) అనే రైతు శుక్రవారం వడదెబ్బతో మృతి చెందాడు. గ్రామానికి చెందిన పంది జగన్ అనే రైతు తన రెండు ఎకరాల పొలంలో ఆడ మగ వరి పంటను సాగు చేస్తున్నాడు. రెండు మూడు రోజులుగా తన పొలంలో వరిని దులుపుతున్నాడు. అందులో బాగంగా శుక్రవారం కటుంబ సభ్యులతో దులుపుతుండగా అస్వస్థతకు గురి అయ్యాడు. చికిత్స నిమిత్తం 108 వాహనం ద్వారా కరీంనగర్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో వడదెబ్బతో మృతి చెందాడు. మృతుడికి భార్య ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు


జగన్(ఫైల్)

దరఖాస్తుల ఆహ్వానం

తిమ్మాపూర్, మార్చి22: ఎస్‌బీఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ సంపత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 15 నుంచి 30రోజుల పాటు ఫొటో గ్రఫీ అండ్ వీడియో, ఏప్రిల్ 18నుంచి సీసీటీవీ ఇనస్టాలేషన్ అండ్ సర్వీసింగ్‌లో పురుషులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన గ్రామీణ ప్రాంతాల అభ్య ర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9949448157, 9849411002 నంబర్లలో సంప్రదించాలని సంస్థ డైరెక్టర్ తెలిపారు. అర్హులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

జగిత్యాల టౌన్, మార్చి 22: జగిత్యాల జిల్లా కేంద్రంలోని బీరయ్య గుడి ప్రాంతంలో ఉన్న ఓ ఇంటిలో చోరీ జరిగింది. బీరయ్య గుడి ప్రాంతానికి చెందిన రాజేశం రెండు రోజుల క్రితం ఎండపెల్లి మండల కేంద్రానికి కుటుంబంతో వెళ్లారు. గురువారం రాత్రి ఇంటికి తిరిగి చేరుకున్న రాజేశం ఇంటి తలుపులు తెరిచి ఉండడంతో చోరీ అయినట్లు గుర్తించారు. గుర్తు తెలియని దొంగలు ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలో ఉన్న నాలుగు తులాల బంగారంతో పాటు రూ. 10 వేల నగదును అపహరించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం పోలీసులు సంఘటనా స్థలాన్ని సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వేలి ముద్రలు సేకరించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

కమాన్‌పూర్, మార్చి 22 : మండలంలోని గుండారం గ్రామంలో రోడ్డు దాటుతున్న వ్యక్తిని గుర్తు తెలియని వాహనం అతివేగంగా వచ్చి ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటన శుక్రవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసులు,కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం పెద్దపల్లి మండలం రంగాపూర్ గ్రామానికి చెందిన కాశెట్టి సతీష్(38) గుండారం గ్రామంలోని తన అమ్మమ్మ ఇంటికి వెళ్లాడు. ఈక్రమంలో తెల్లవారుజామున తన స్వగ్రామానికి వచ్చేందుకు రోడ్డు దాటుతున్న క్రమంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు మృతదేహాన్ని పెద్దపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

బావిలో పడి మహిళ..

ఇల్లందకుంట, మార్చి 22: మండలంలోని సీతంపేట గ్రామంలో మతిస్థిమితం లేని జోరుక రమ (40) అనే మహిళ వ్యవసాయ బావిలో పడి మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రమకు మూడు నెలలుగా మతి స్థిమితం కోల్పోయింది. గురువారం తన సొంత గ్రామమైన భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలంలోని పర్లపల్లి గ్రామం నుంచి తమ బంధువులైన సీతంపేట గ్రామానికి వచ్చి తిరిగి పర్లపల్లి వెళ్తున్నానని చెప్పి వెళ్లిపోయింది. శుక్రవారం సీతంపేట గ్రామంలోని ఓ వ్యవసాయ బావిలో పడి మృతి చెందింది. మృతురాలి భర్త రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రాజకుమార్ తెలిపారు.

డీవైడర్‌ను ఢీకొని రైతు దుర్మరణం

ఎల్లారెడ్డిపేట, మార్చి 22 : ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లి గ్రామ శివారులోని ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మండల కేంద్రానికి చెందిన చందుపట్ల లక్ష్మారెడ్డి (45) అనే రైతు శుక్రవారం రాత్రి దుర్మరణం పాలయ్యాడు. లక్ష్మారెడ్డి గొల్లపల్లి నుంచి తన భార్య, సమీప బంధువుతో కలిసి ఎల్లారెడ్డిపేట వైపు బైక్‌పై వస్తుండగా డీవైడర్‌ను ఢీకట్టి కిందపడ్డాడు. తలకు బలమైన గాయం కావడంతో తీవ్ర రక్తస్రావమై అక్కడిక్కడే మృతిచెందాడు. లక్ష్మారెడ్డి రెండు సంవత్సరాల క్రితం విదేశాల నుంచి వచ్చి వ్యవసాయ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. భార్య రేణుక, బంధువుకు గాయాలు కావడంతో స్థానికులు గమనించి ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య రేణుక, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నాయి. పోలీసులు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు.

ఉరివేసుకొని యువకుడి ఆత్మహత్య

హుజూరాబాద్, మార్చి 22: హుజూరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని బోర్నపల్లి గ్రామానికి చెందిన గంట కుమారస్వామి (26) అనే యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు శుక్రవారం పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కుమారస్వామి ఆరు నెలల నుంచి మద్యానికి బానిసై ఇంట్లో తరుచూ భార్యతో గొడవపడేవాడు. గొడవలు, మద్యం మానలేక మనస్తాపం చెంది గురువారం రాత్రి ఇంట్లో రేకుల షెడ్డు ఇనుప పైపుకు చీరతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్యతో పాటు ఒక కూతురు ఉన్నారు. మృతుడి తండ్రి గంట సారయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ బొల్లం రమేశ్ తెలిపారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో ముగ్గురికి జైలు శిక్ష

కరీంనగర్ క్రైం, మార్చి 22: డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ముగ్గురు వ్యక్తులకు శుక్రవారం కరీంనగర్ మున్సిఫ్ మెజిస్ట్రేట్ మూడు రోజులు జైలుశిక్ష లేదా రూ.5,500లు జరిమానా విధించారని కరీంనగర్ ట్రాఫిక్ సీఐ కరీం ఉల్లాఖాన్ తెలిపారు. 10 మంది వాహనదారులను కోర్టులో హాజరుపరచగా మరో ఏడుగురు వ్యక్తులకు 11,500 రూపాయల జరిమానా విధించినట్లు తెలిపారు.

ఒకరికి జైలు శిక్ష

కోల్‌సిటీ, మార్చి 22: రామగుండం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పీ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన సిద్దేశ్వర్ తల్వార్ అనే వ్యక్తికి శుక్రవారం గోదావరిఖని సెకండ్ అడిషనల్ మేజిస్ట్రేట్ వెంకటేష్ దుర్వ ఎదుట హాజరుపరిచారు. మేజిస్ట్రేట్ 3రోజుల జైలు శిక్ష విధించినట్టు పోలీసులు తెలిపారు.

ముగిసిన ఏఎస్ఐ అంత్యక్రియలు

కరీంనగర్ క్రైం/తిమ్మాపూర్, మార్చి 22 : కరీంనగర్ రూరల్ పోలీసు ఠాణాలో పనిచేస్తున్న ఏఎస్ఐ గురువారం మరణించగా అంత్రక్రియలు శుక్రవారం నిర్వహించారు. తిమ్మాపూర్ మండలం మన్నెంపల్లిలో నిర్వహించిన ఏఎస్ఐ కిషన్ అంత్యక్రియల్లో కరీంనగర్ అడిషనల్ డీసీపీ(ఏఆర్) అనోక్‌జైన్ పాల్గొన్నారు. కిషన్ కుటుంబ సభ్యులను పరామర్శించిన అడిషనల్ డీసీపీ వారి కుటుంబానికి ఎళ్లవేళలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రిజర్వు ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

చొప్పదండి, మార్చి 22: చొప్పదండి శివారులోని కాకతీయ కాలువ డి86 డిస్ట్రిబ్యూటర్ వద్ద గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. కాలువకు సంబంధించిన లస్కర్ కనుకయ్య శుక్రవారం మృతదేహాన్ని గమనించి పోలీసులకు సమాచారాన్ని అందించాడు. సంఘటన స్థలానికి ఎస్సై ఉపేంద్రచారీ చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. సుమారు 30 నుంచి 40 ఏండ్ల వయస్సు గల మహిళ మృతదేహంగా భావిస్తున్నారు. మృతదేహం బాగా కుళ్లిన స్థితిలో ఉందని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పాలకుర్తి, మార్చి22: బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని జీడినగర్ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందినట్లు బసంత్‌నగర్ ఎస్సై ఆర్ స్వామి తెలిపారు. కుంటాల కొండయ్య అనేవ్యక్తి పెద్దకుమారుడు విజయ్‌కుమార్ మానసిక రుగ్మతతో బాధపడుతూ మందులు వాడుతున్నాడు. ఈనెల 17న మోతాదుకు మించి మందులు వేసుకోగా, కుటుంబ సభ్యులు గమనించి ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడని, కొండయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

గోదావరిలో పడి పశువుల కాపరి మృతి

మల్లాపూర్, మార్చి, 22 : మండలంలోని వాలొండ గ్రామ శివారులోని ప్రమాదవశాత్తు గోదావరిలో పడి పశువుల కాపరి పుట్ట గంగరాం(55) నీట మునిగి మృతి చెందినట్లు శుక్రవారం ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..నిర్మల్ జిల్లా సోన్ మండలంలోని మాదాపూర్ గ్రామానికి చెందిన పుట్ట గంగరాం తన కొడుకు పుట్ట సురేష్‌తో కలిసి పశువులను మేపుతూ జీవనం కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో పశువులను మేపుకుంటూ మండలంలోని వాల్గొండ గంగ సమీపానికి వచ్చారు. అక్కడ ప్రమాదవశాత్తు గంగారాం నీట మునిగి మృతి చెందినట్లు తెలిపారు. గంగారాం కొడుకు సురేష్ ఫిర్యాదు మేరకు సంఘటన స్థలం పరిశీలించి కేసు నమోదు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైతులు అధికారుల సూచనలు పాటించాలి


మాట్లాడుతున్న వ్యవసాయశాఖ సంచాలకులు చత్రునాయక్

ఇల్లందకుంట, మార్చి 22: రైతులు తమ వ్యవసాయ పనుల్లో అధికారుల సూచనలు, సలహాలు పాటించి అధిక దిగుబడి సాధించాలని వ్యవసాయ శాఖ సంచాలకులు చత్రునాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని సిరిసేడు గ్రామంలోని రైతు వేదికలో మండల వ్యవసాయాధికారిని గుర్రం రజిత ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చత్రునాయక్ మాట్లాడారు. ప్రస్తుత యాసంగి సీజన్‌లో వరి పైరుకు అగ్గి తెగులు, మెడ విరుపు తెగుళ్ల నివారణ, యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు వివరించారు. అగ్గి తెగులు నివారణకు ట్రై సైక్లోజోల్ 0.6 గ్రాములు, మాన్కోజెబ్ 2.5 గ్రాములు ఐసోప్రోతయోలెన్ 2.5 గ్రాములు నీటిలో కలుపుకొని తెగులు ఉధృతిని బట్టీ 10నుంచి 15రోజుల వ్యవధిలో రెండుసార్లు స్ప్రే చేయాలన్నారు. అదేవిధంగా పాముపొడ తెగులు గమనించినట్లయితే హైక్సకెనజోల్ 2ఎంఎల్, వాలిడామైసిన్ 2ఎంఎల్, ప్రొపికొనిజోల్ 1ఎంఎల్ లీటర్ నీటికి కలిపి 15రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలని సూచించారు. కాండం కుళ్లు తెగులు గమనించినట్లయితే హెక్సాకోనజోల్ 2ఎంఎల్, వాలిడామైసిన్ 2ఎంఎల్, కార్బండెజమ్ 1 గ్రాము 15 రోజుల్లో రెండుసార్లు స్ప్రే చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో మమత, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన జగిత్యాల ఎమ్మెల్యే


సీఎంకు వినతి పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే

జగిత్యాల, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డిని శుక్రవారం సీఎం క్యాంపు కార్యాలయంలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మర్యాద పూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో అభివృద్ధికి నిదులు కేటాయించాలని రూపొందించిన ప్రణాళిక పత్రాన్ని రేవంత్‌రెడ్డికి అందించారు. జగిత్యాలలోని నూకపల్లి డబుల్ బెడ్‌రూం ఇళ్లలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలని కోరినట్లు తెలిపారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి

మెట్‌పల్లి రూరల్, మార్చి, 22 : గ్రామాల్లో నీటిని వృధా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని అధికారులు సూచించారు. అంతర్జాతీయ జల దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండలంలోని ఆత్మనగర్‌లో హెల్త్ అధికారి డాక్టర్ కృష్ణవేణి, పంచాయతీ కార్యదర్శి నిజాముద్దీన్‌లు ప్రజలతో ప్రతిజ్ఞ చేయించి అనంతరం గ్రామంలో పర్యటించి డ్రై డేపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవిలో నీటి కొరత ఏర్పడకుండా ప్రతీ రోజు నీటిని వృధా చేయకుండా పొదుపుగా వాడుకుంటే సమస్యలు ఉండవని, ఇంటిలోని ఖాళీ ప్రదేశంలో ఇంకుడు గుంతలను నిర్మించుకుంటే భూగర్భ నిల్వలను ఎండిపోవన్నారు. ఇంటిని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జరుపుల శ్రీనివాస్, ఏఎన్ఎం వసంత, ఆశా వర్కర్ హేమ, సిబ్బంది, పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనులు పరిశీలించిన డీఆర్డీవో


మల్యాలలో కూలీలతో మాట్లాడుతున్న డీఆర్డీవో

మల్యాల, మార్చి 22: మండలంలోని మల్యాల, ముత్యంపేట గ్రామాల్లో ఉపాధిహామీ పనులను డీఆర్డీవో సంపత్‌రావు పరిశీలించారు. నర్సరీలు, ఖండిత కందకాలను సందర్శించి కూలీలతో మాట్లాడారు. పనుల జరుగుతున్న తీరుపై అడిగి తెలుసుకున్నారు. వంద రోజుల పనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో స్వాతి, ఏపీవో శ్రీనివాస్, ఈసీ మనోజ్, టీఏ లావణ్య, పంచాయితీ కార్యదర్శి స్వప్న సిబ్బంది ఉన్నారు

నిర్లక్ష్యం.. ప్రమాదకరం

మల్యాల, మార్చి 22: జగిత్యాల-కరీంనగర్ మార్గంలోని కొండగట్టు స్టేజి వద్ద కొన్నాళ్ల క్రితం ఏర్పడిన గుంత ప్రమాదకరంగా మారింది. రహదారి మార్గంలో ఏర్పడిన ఈ గుంత వాహనాల రాకపోకలతో నిత్యం కుంగుతూ తరచూ ప్రమాదాలకు హేతువుగా మారుతోంది. పలుమార్లు మరమ్మతులు చేసినప్పటికీ కుంగుతుండడంతో వాహనదారులకు అసౌకర్యంగా మారుతోంది. గుంత చుట్టూ ఏర్పాటు చేసిన ఇనుప గేటు మరీ ప్రమాదకరంగా మారాయి. సంబంధిత అధికారులు శాశ్వత మరమ్మతులు చేపట్టాలని వాహన దారులు, స్థానికులు కోరుతున్నారు

సమష్టి కృషితోనే సమస్యల పరిష్కారం

పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు గాదె నర్సింగరావు


చింతలపేటలో సభ్యత్వ నమోదులను అందజేస్తున్న పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు గాదె నర్సింగరావు

మెట్‌పల్లి రూరల్, మార్చి, 22 : ఉపాధ్యాయులు సమష్టిగా ఉంటేనే సమస్యలను పరిష్కరించుకోవచ్చని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు గాదె నర్సింగరావు అన్నారు. శుక్రవారం పీఆర్టీయూ రాష్ట్ర నాయకులు హర్షవర్ధన్‌రెడ్డి, రాజు జాదవ్ పిలుపు మేరకు ఉపాధ్యాయలకు సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా యూసుఫ్‌నగర్, అల్లీపూర్, చింతలపేట గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలోని ఉపాధ్యాయులకు సభ్యత్వాలను అందజేశామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని కేడర్‌ల ఉపాధ్యాయుల సీపీఎస్ రద్దు, డీఏ బకాయిలు, మైనార్టీ, గురుకుల ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతలతో పాటు ఇతరత్రా సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ రాష్ట్ర నాయకుల ఆధ్వర్యంలో సాధించుకోవడం కోసం నమోదు కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తిరుపతి, ఉపాధ్యా యులు, పాల్గొన్నారు.

సేవ చేయడం అభినందనీయం

కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

మల్లాపూర్, మార్చి, 22: కుటుంబంలో మృతి చెందిన వారి జ్ఞాపకార్థంతో సేవలు చేయడం అభినందనీయమని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. శుక్రవారం మండలంలోని సిర్పూర్ సింగిల్ విండో చైర్మన్ బద్దం అంజిరెడ్డి మృతి చెందిన తన తండ్రి బద్దం తుక్కారెడ్డి, తమ్ముడు అనిల్ రెడ్డి జ్ఞాపకార్థంగా నడికూడలో నిర్మించిన బస్ షెల్టర్, సిర్పూర్ గ్రామానికి వైకుంఠ రథాన్ని సొంత నిధులతో అందిచగా వారి కుటుంబ సభ్యులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యుల పేరు మీదుగా సేవ చేయడంతో వారి పేరు ప్రజల్లో నిలిస్తుందన్నారు. యువత సామాజిక సేవలు చేస్తూ తోటి వారికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెక్‌పోస్ట్‌ను పరిశీలించిన ఏఎస్పీ

కథలాపూర్, మార్చి 22 : మండలంలోని కలికోట చెక్ పోస్ట్‌ను శుక్రవారం ఏఎస్‌పీ శివం ఉపాధ్యాయ పరిశీలించారు. ఎన్నికల నియమావళిలో భాగంగా కలికోట వద్ద చెక్‌పోస్ట్‌ను అధికారులు ఏర్పాటు చేశారు.

మద్యం అక్రమ రవాణా, డబ్బు తరలింపు వంటి వాటిపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. కోరుట్ల సీఐ సురేశ్‌బాబు, ఎస్సై నవీన్ ఉన్నారు.

మాజీ ఉప సర్పంచ్‌పై హత్యాయత్నం?

● మోటారు వద్ద కరెంట్ తీగ ఏర్పాటు

● పోలీసులకు ఫిర్యాదు

వెల్గటూర్/ఎండపల్లి, మార్చి 22: కొండాపూర్ మాజీ ఉప సర్పంచ్ వెంకటస్వామికి చెందిన పొలం వద్ద మోటారు సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు ఏర్పడ కుండా కరెంట్ తీగను అమర్చి హత మార్చాలని చూసినట్లు అనుమానంతో శుక్రవారం వెంకటస్వామి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంకటస్వామి తెలిపి న వివరాల ప్రకారం గుర్తు తెలియని వ్యక్తులు ఏర్పాటు చేసిన కరెంట్ తీగను గమనించక పొలానికి నీరు పెట్టడానికి మోటారు వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలో ఎర్త్ రావడంతో అనుమానం వచ్చి వెనుదిరిగాడు. అనంతరం అక్కడ పరిశీలించగా ఏర్పడకుండా ఓ తీగను అమర్చినట్లు స్థానికులతో కలిసి గమనించారు. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రాణాలు గాలిలలో కలిసేవని వెంకటస్వామి ఆవేదన వ్యక్తం చేశాడు. పోలీసులకు సమాచారం ఇవ్వగా ఎస్సై ఉమాసాగర్ సంఘటనా స్థలానికి చేరుకొని పరిసరాలు పరిశీలించారు. కరెంట్ తీగను అమర్చిన వారు ఎవరు అనేది పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.

ఓటు హక్కు వినియోగించుకోవాలి



అయిలాపూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామ పంచాయతీ సిబ్బంది, అంగన్‌వాడీలు


మెట్‌పల్లిలో ర్యాలీ తీస్తున్న మున్సిపల్ అధికారులు



మల్లాపూర్‌లో ర్యాలీలో పాల్గొన్న అధికారులు

కోరుట్ల, మార్చి 22: ప్రతీ ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలని రెవెన్యూ డివిజన్ అధికారి అనంద్ కుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని కల్లూర్ రోడ్డులో ఐ ఓటు ఫర్ షూర్ కార్యక్రమంలో భాగంగా ఓటు హక్కు విలువలపై అవగాహన కల్పించి ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులతో కలిసి ఓటు హక్కు విలువపై అవగాహన కల్పించారు. తల్లి దండ్రులు ఓటు హక్కు వినియోగించుకునే విధంగా చొరవ చూపాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిషన్,ఆర్డీఓ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కోరుట్ల రూరల్: మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం ఐ ఓట్ ఫర్ షూర్ కార్యక్రమంలో భాగంగా ఓటు హక్కు వినియోగంపై అవగాహన ర్యాలీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటు హక్కు వినియోగంపై గ్రామస్థులకు అవగాహన కల్పించి వంద శాతం ఓటు హక్కు నమోదు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, బీఎల్‌ఓలు, పంచాయతీ కార్యదర్శులు సిబ్బంది పాల్గొన్నారు.

మెట్‌పల్లి: పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతీ ఒక్కరు తమ ఓటును వినియోగించుకోవాలని మెట్‌పల్లి మున్సిపల్ కమిషనర్ మోహన్, తహసీల్దార్ శేఖర్‌లు సూచించారు.

ఎన్నికల కమిషన్ అధికారుల ఆదేశాల మేరకు ఓటు హక్కు వినియోగంపై పట్టణంలోని పోలింగ్ స్టేషన్‌ల వరకు సిబ్బందితో ర్యాలీ చేపట్ట ప్రజలకు అవగాహన కల్పించారు. 18 సంవత్సరాలు నిండిన వారి పేర్లు ఓటరు లిస్టులో లేకుంటే నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సానిటరీ ఇన్స్‌పెక్టర్ రత్నాకర్, ముజీబ్, శివ, గంగరాణి, జ్యోతి, నిజాం, ఆర్పీలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పెగడపల్లి: మండలంలోని బతికెపల్లి, పెగడపల్లి గ్రామాల్లో శుక్రవారం ఓటు హక్కు వినియోగంపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు. తహసీల్దార్ ఆర్. శ్రీనివాస్, మండల పంచాయతీ అధికారి మహేందర్‌లు ఆయా గ్రామాల ఉద్యోగులు, యువకులతో కలసి ర్యాలీలు నిర్వహించి ఓటు హక్కు వినియోగం, అర్హులైన ప్రతీ ఓటరు తమ ఓటు హక్కును విధిగా వినియోగించుకోవాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీఎం సమత, పంచాయతీ కార్యదర్శులు ప్రవీణ్, నిఖిల్‌రెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

మల్లాపూర్: పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతీ ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకునేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని మల్లాపూర్ తహసీల్దార్ వీరసింగ్ సూచించారు. శుక్రవారం మల్లాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాలను తప్పకుండా పాటిస్తూ గ్రామాల్లోని ప్రజలు ఓటు హక్కు వినియోగం, ఓటు హక్కు సభ్యత్వంపై అవగాహన కల్పించాలన్నారు. ఎన్నికల నిమయాల ప్రకారం గ్రామాల్లో పనులు చేపట్టాలని అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, పంచాయతీ అధికారులు అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పట్టణంలోని సమస్యలను త్వరగా పరిష్కరించాలి

కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్


మెట్‌పల్లిలోని కాలనీలను పరిశీలిస్తున్న కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్

మెట్‌పల్లి, మార్చి, 22 : పట్టణంలోని సమస్యలను త్వరగా పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ సూచించారు. గుడ్ మార్నింగ్ కోరుట్ల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని 17వ వార్డును సందర్శించారు. వార్డుల్లోని కాలనీలలోని రోడ్లు, మురికి కాలువలు, పారిశుధ్య పనులు పరిశీలించి కాలనీ వాసులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని మిషన్ భగీరథ లీకేజీల పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా మంచి నీటిని సరఫరా చేయాలని, మురికి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, దెబ్బ తిన్న మురికి కాలువ పనులను త్వరగా చేపట్టి సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ అధికారులను సూచించారు. పట్టణంలో ఎలాంటి సమస్యలు ఉన్న నేరుగా సంప్రదించాలని, అధికారులు ప్రజల సమస్యలపై దృష్టి సారించాలన్నారు. సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరి అందించాలని అధికారులకు ఆదేశించారు. ఈయన వెంటా కౌన్సిలర్ వనజ-శ్రీనివాస్‌గౌడ్, కిషోర్, టీఆర్ఎస్‌వై నాయకులు తేజ పాల్గొన్నారు.

బస్ షెల్టర్ ఏర్పాటు అభినందనీయం

కోరుట్ల రూరల్, మార్చి 22 : గ్రామంలో ప్రయాణికులు సౌకర్యార్థం బస్సు షెల్టర్ ఏర్పాటు చేయడం అభినందనీయమని గ్రామస్తులు అన్నారు. శుక్రవారం గ్రామం లో హనుమాన్ దేవాలయం వద్ద గ్రామానికి చెందిన మార్గం శోభన్ - మమత దంపతులు వారి తల్లిదండ్రు లు సామల్ల గంగు బాయి-కిషన్‌ల జ్ఞాపకార్థం రూ. 50 వేలు వెచ్చించి బస్సు షెల్టర్‌ను నిర్మాణం చేసి గ్రామస్థులతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధికి సహకారం అందించిన శోభన్‌ను గ్రామస్థులు అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ సురేష్ గౌడ్, మాజీ సర్పంచ్ సత్యనారాయణ, పల్లితుక్కయ్య, శ్రీనివాస్, మల్లయ్య, లక్ష్మిరాజం, మల్లేశం, ప్రశాంత్, భూమేష్, వెంకయ్య, హరికృష్ణలతో పాటు పలువురు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలి

కాంగ్రెస్ రాష్ట్ర కిసాన్‌సెల్ అధ్యక్షుడు సుంకేట అన్వేష్‌రెడ్డి

మెట్‌పల్లి రూరల్, మార్చి, 22 : పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించ డానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కాంగ్రెస్ రాష్ట్ర కిసాన్‌సెల్ అధ్యక్షుడు, సీడ్స్ విత్తనాభివృద్ధి చైర్మన్ సుంకేట అన్వేష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేం దర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయనతో పాటు ఉర్దూ అకాడమీ చైర్మన్ తయార్బిన్ హమ్మద్‌లను శాలువలతో సన్మానించారు. కోరుట్ల నియోజక వర్గంలో కాంగ్రెస్ పార్టీపై ప్రజల మధ్య అదరణ, పార్టీ పరిస్థితుల గురించి మహేందర్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన అనతి కాలంలోనే ప్రవేశపెట్టి అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నల్ల బాపురెడ్డి, సుశాంత్‌రెడ్డి, అలూరి సురేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీనారాయణ స్వామి కల్యాణం





కోరుట్లలో, రాయికల్ మండలం ఇటిక్యాలలో స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

కోరుట్ల, మార్చి 22 : పట్టణంలోని అష్టలక్ష్మి సహిత లక్ష్మీనారాయణ ఆలయంలో పంచాదశ వార్షికోత్సవ పంచాహ్నిక బ్రహోత్సవాలలో భాగంగా శుక్రవారం లక్ష్మీనారాయణ స్వామి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. దేవాలయంలో అర్చన అభిషేక కార్యక్రమాలను జరిపారు. అగ్ని ప్రతిష్ట ద్వజారోహణం నిర్వహించారు. ప్రత్యేక వేదిక ద్వార అష్టలక్ష్మి సహిత శ్రీమన్నారాయణ స్వామి తరుకల్యాణ మహోత్సవం వేద పండితులు సముద్రాల రామాచార్యులు మత్రోచ్చారణ మధ్య సాగింది. భక్తులకు దేవాలయ నిర్వహకులు అన్నదాన కార్యక్రమాన్ని జరిపారు. ఆలయంలో బ్రహోత్సవాలను ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వా హకులు బూరుగు రామస్వామి గౌడ్, పురోహితులు శ్రీనివాసాచార్యులు, శివకు మారాచార్యులు, దేవాలయ కమిటీ సభ్యులు చౌటుకూరి అంజయ్యగౌడ్, ముత్యాల గంగాధర్ వెంటేశ్వరరావు, కోటగిరి మహేష్, గంగాధర్, పురుషోత్తం, చిలుక గంగాధర్, రంగు రమేష్, శ్రీనివాస్, సతీష్, భూమయ్య, చందు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా లక్ష్మీవేంకటేశ్వర స్వామి కల్యాణం

రాయికల్: మండలంలోని ఇటిక్యాల గ్రామంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం లక్ష్మీవేంకటేశ్వర స్వామి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. మంగళవాయిద్యాల నడుమ, భక్తుల గోవింద నామస్మరణల మధ్య ఆలయ అర్చకులు జగన్మోహనాచార్యులు, వేద పండితులు లక్ష్మణాచార్యులు, రఘునాథాచార్యుల వేద మంత్రోచ్ఛరణలతో కన్నుల పండువగా నిర్వహించారు కల్యాణం అనంతరం భక్తులు స్వామివారికి ఓడి బియ్యం, కుడుకలు, కనుములు అందజేశారు. తర్వాత స్వామివారిని తులాభారం వేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కొమ్ముల రాధఆదిరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ మహిపతిరెడ్డి, మాజీ సర్పంచులు సామల లావణ్యవేణు, నారాయణ గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు బొడుగం మల్లారెడ్డి, అనుపురం చిన్న లింబాద్రి గౌడ్, కనపర్తి శ్రీనివాస్, గ్రామ సేవా సమితి అధ్యక్షుడు కంటె విష్ణు, నాయకులు సురకంటి చిన రాజురెడ్డి, సుజాత పాల్గొన్నారు.

'విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి'



మాట్లాడుతున్న తహసీల్దార్ రాజమణి

కొడిమ్యాల, మార్చి 22 : విద్యార్థులు పోటీ ప్రపంచంలో నైపుణ్యాలను పెం పొందించుకోవాలని తహసీల్దారు రాజమణి అన్నారు. కరీంనగర్‌లోని వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాల జాతీయ సేవాపథకం ఎన్.ఎస్.ఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తు న్న ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం శుక్రవారం ముగిసింది. ముగింపు సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన తహసీల్దారు మాట్లాడుతూ వలంటీర్లు వివిద రకాల శ్రమదానం, అవగాహన ర్యాలీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అంతక ముందు కొడిమ్యాల జూనియర్ కళాశాలలో కొడిమ్యాల మాజీ ఉప సర్పంచు గడ్డం జీవన్‌రెడ్డితో పాటుగా 12 మంది వలంటీర్లు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎస్సై సందీప్ మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానం అన్నారు. యువత రక్తదానం చేయటం సామాజిక బాధ్యతగా గుర్తించాలన్నారు. ప్రమాదాలు సంభవించినప్పుడు ఎంతో అసౌకర్యానికి గురవుతున్నవారికి రక్తదానం చేయటంతో ప్రాణాలు కాపాడిన వారవుతారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు ఆర్. గోపికృష్ణ, కె. సతీష్‌కుమార్, మాజీ ఉప సర్పంచు గడ్డం జీవన్‌రెడ్డి, కొడిమ్యాల కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ తిరుపతి, సీనియర్ వలంటీర్లు ఎం. రవిచందర్, పి. సంతోష్ వలంటీర్లు పాల్గొన్నారు. వలంటీర్లు పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించకుంటే చర్యలు తప్పవు

కోరుట్ల, మార్చి 22 : వాటర్ ప్లాంట్లలో పారిశుధ్య పరిమాణాలు పాటించని యజమానులపై చట్టపరమైన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ తిరుపతి అన్నారు. శుక్రవారం పట్టణంలోని పలు వార్డులలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్లను సానిటరి ఇన్‌స్పెక్టర్ గజానంద్, హెల్త్ అసిస్టెంట్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి పరిణామాలు పాటించని యజమానులకు జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా కమిషనర్ తిరుపతి మాట్లాడారు. ప్రజారోగ్యం దృష్టిలో ఉంచుకొని ప్లాంట్ యజమానులు నాణ్యమైన నీరు సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ జూనియర్ అసిస్టెంట్ ఆకు అంజయ్య, రమేష్, రాజులతో పాటు పలువురు పాల్గొన్నారు.

విద్యార్థులు సేవా గుణాన్ని అలవర్చుకోవాలి

కొడిమ్యాల, మార్చి 22 : విద్యార్థులు చిన్ననాటి నుంచి సేవా గుణాన్ని అలవర్చుకోవాలని కొడిమ్యాల ఎస్సై ఎస్. సందీప్ అన్నారు. మండలంలోని నల్లగొండ గ్రామ శ్రీలక్ష్మీ నర్సింహస్వామి బ్రహ్మోత్సవాల్లో కొడిమ్యాల పోలీస్ శాఖ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో సేవలు అందించిన వలంటీర్లకు శుక్రవారం ప్రశంసా పత్రాలను ఎస్సై అందించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ జాతీయ సేవా పథకం కార్యక్రమంలో పాల్గొంటే సోదర బావం పెరుగుతుందన్నారు. సమాజంలో జీవన విదానాలు అలవడు తాయన్నారు. విద్యతో పాటుగా సామాజిక దృక్పథాన్ని కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కొడిమ్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా.. పి. తిరుపతి, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ బాలక్రిష్ణారెడ్డి, అధ్యాపకులు ప్రవీణ్‌కుమార్ వలంటీర్లు పాల్గొన్నారు.

పోషణ పక్షోత్సవాలు

జగిత్యాల, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇబ్రహీంనగర్ గ్రామంలో శుక్రవారం అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు తీసుకోవాల్సిన ఆహారపు అలవాట్ల గురించి తగు సూచనలు చేశారు. రక్తహీనతపై అవగాహన కల్పించారు. ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా మంచినీటి ప్రాముఖ్యతక వివరించారు. అనంతరం పిల్లలకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జ్యోతి, టీచర్లు రమాదేవి, రాధ పాల్గొన్నారు.

కోరుట్ల రూరల్: మండలంలోని అయిలాపూర్‌లో పోషణ్ పక్వాడ్ వేడుకలను అంగన్‌వాడీ టీచర్లు ఘనం గా నిర్వహించారు. గర్భిణులకు తల్లి పాల ప్రాము ఖ్యంపై అవగాహన కల్పించారు. కిశోర బాలికలకు పౌష్టి క ఆహారం తీసుకునే విధంగా ఆరోగ్యం గురించి తీసుకోవలసిన జాగ్రత్తలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షైని మధ్యూ, అంగన్‌వాడీ టీచర్లు మంజుల, రాజమణి కాళేశ్వరి, శైలజ, విమల, సుమతి పాల్గొన్నారు.

జగిత్యాలరూరల్ : జగిత్యాల రూరల్ మండలంలోని తక్కళ్లపల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషన్ పక్వాడా, ప్రపంచనీటి దినోత్సవ కార్యక్రమాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఐసీడీఎస్ సూపర్ వైజర్ లావణ్య మాట్లాడుతూ ప్రతి ఇంట్లోను వర్షపునీరు వృధాకాకుండా ఒంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు జ్యోష్న, నాగమణి, ఆయాలు తల్లితండ్రులు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

జగిత్యాల, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇస్రాజ్‌పల్లె గ్రామంలో పశువులకు శుక్రవారం గాలికుం టు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి వేణుగోపాల్, జిల్లా పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ భోనగిరి నరేష్‌లు తనిఖీ చేశారు. వ్యాక్సినేషన్ విధానం, ఆన్‌లైన్ అప్‌లోడింగ్ విషయాలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు.

పశువుల సంరక్షణపై ప్రత్యేక చర్యలు

కోరుట్ల రూరల్, మార్చి 22 : పశు సంరక్షణకు ప్రత్యేక చర్యలు చెపట్టినట్లు పశువైద్య నియోజకవర్గ ప్రోగ్రాం మానిటరింగ్ స్పెషల్ అధికారి అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బక్కయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని పైడిమడుగు గ్రామంలో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ దీరజ్‌తో కలిసి పశువులకు గాలికుంట వ్యాధి నివారణపై టీకాలను కార్యక్రమాన్ని ప్రారంభించారు. సుమారు 202 గేదెలకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు అందించినట్లు వెటర్నరీ లైవ్ స్టాక్ అఫీసర్ కందుకూరి పూర్ణ చందర్ తెలి పారు. వెటర్నరీ అధికారులు అనందం, నయిద్, అక్తర్, పశు యజమానులు పాల్గొన్నారు.

లక్ష్మీపూర్ రైతు ఉత్పత్తిదారుల కంపెనీ సందర్శన

జగిత్యాలరూరల్, మార్చి 22 : జగిత్యాల రూరల్ మండలంలోని లక్ష్మీపూర్ రైతు ఉత్పత్తిదారుల కంపెనీని ఎఫ్‌పీఓలు శుక్ర వారం సందర్శించారు. లక్ష్మీపూర్‌లో గల రైతు ఉత్పత్తిదారుల కం పెనీని పెద్దపల్లి, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల ఎపీవోలు, సీఈఓలు, కార్యాలయాల సిబ్బంది సందర్శించి గోదాం, నూతన భవనం, కంపెనీలో జరుగుతున్న వివిధ కార్యక్రమాల గూర్చి అడిగి తెలుసుకున్నారు. సంఘం చైర్మన్ తిరుపతిరెడ్డి, వైస్‌చైర్మన్ గంగయ్య, అధికారులు, రైతుసంఘ సభ్యులు పాల్గొన్నారు.


రంగా రవీందర్ గుప్తాకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

మల్కాజిగిరికే అత్యధికంగా ఇందిరమ్మ ఇళ్లు

● మంజూరు చేయిస్తానని తుమ్మల హామీ

తిరుమలగిరి మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో సీఎం కోట కింద ఇందిరమ్మ ఇళ్లను అత్యధికంగా మంజూరు చేయిస్తానని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హామీఇచ్చారు. శుక్రవారం తిరుమలగిరిలోని జయలక్ష్మి గార్డెన్‌లో మల్కాజిగిరి పార్లమెంట్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పార్లమెంట్ నియోజకవర్గం కావడంతో తిరిగి ఈ పార్లమెంట్ సీటు నుంచి పోటీ చేస్తున్న పట్నం సునీతారెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వంలో అన్ని ప్రభుత్వరంగ సంస్థలు నిర్వీర్యమయ్యాయని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత వాటన్నింటినీ తిరిగి గాడిలో పెడతామని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పట్నం సునీతారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, వెన్నెల, శ్రీగణేష్, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి, సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డిలు పాల్గొన్నారు. అయితే బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు రంగారవీందర్ గుప్తాను కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.


ఆటో అండ్ మోటార్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కిరణ్ మృతదేహానికి ప్రజాసంఘాల నాయకుల నివాళులు

ఏఎంఎఫ్ కిరణ్‌కు అంతిమ వీడ్కోలు

నివాళులు అర్పించిన ప్రజాసంఘాలు

జవహర్‌నగర్, మార్చి, 22 (ఆంధ్రజ్యోతి): ఆటో అండ్ మోటార్ యానియన్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మాసు ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు కిరణ్ ఈనెల 21న జవహర్‌నగర్‌లో అనారోగ్యంతో మృతిచెందారు. కిరణ్ మృతదేహానికి ప్రజాసంఘాల నాయకులు పీవోడబ్ల్యూ సంధ్య ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు అనురాధ, మస్తాన్ బీజేపాడు పలువురు నివాళులు అర్పించారు. ప్రజా హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేశారని, జవహర్‌నగర్‌లో స్థానిక సమస్యల పరిష్కారానికి ఎంతో కృషిచేశారని, వారు చేసిన సేవలను ప్రజాసంఘాల నాయకులు కొనియాడారు. అంబేడ్కర్‌నగర్ శ్మశానవాటిలో అంత్యక్రియలు నిర్వహించారు. సీపీఐ, సీపీఎం నాయకులు ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

నాచారం మున్నూరు కాపు సంఘం నూతన అధ్యక్షుడిగా పాదం వెంకటేష్

నాచారం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): నాచారం మున్నూరు కాపు సంఘం నూతన అధ్యక్షుడిగా పాదం వెంకటేష్ నియమితులయ్యారు. శుక్రవారం నాచారం డివిజన్‌లోని సాయికృష్ణ గార్డెన్‌లో గల కాపు సంఘం భవనంలో నూతన కార్యవర్గ కమిటీని ఏర్పాటు చేసుకోవడం జరిగింది. సంఘం గౌరవ సలహాదారులు మీసాల చంద్రయ్య జిల్లా భూపాల్, శ్రీహరి, తోట ముత్యాలు, అధ్యక్షుడుగా పాదం వెంకటేష్, ఉపాధ్యక్షులుగా నర్సింహ్మ, శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా అలారి మహేందర్, కార్యదర్శులుగా దర్శనాల వెంకటేశ్వర్లు, ఆరాల వెంకటేశ్వర్లు, కోశాధికారిగా చందా నరేష్, కార్యవర్గ సభ్యులుగా శ్రీకాంత్, రేవంత్, అనిల్‌కుమార్, సదానందం, శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శులుగా వెంకటేష్, శ్రీనివాస్, సంపత్‌లు నియామకం అయ్యారు. నూతన కార్యవర్గ కమిటీని సంఘ సభ్యులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.


స్టూడెంట్స్ టెక్నికల్ సింపోజియం 2024 ఉత్సవాలను ప్రారంభిస్తున్న ఓయూ వీసీ దా.రవీందర్ తదితరులు

ఘనంగా స్టూడెంట్స్ టెక్నికల్ సింపోజియం 2024 ఉత్సవాలు

తార్నాక, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీలో స్టూడెంట్స్ టెక్నికల్ సింపోజియం 2024 ఉత్సవాలను శుక్రవారం ఓయూ వీసీ దా.రవీందర్ యాదవ్ ప్రారంభించారు. టెక్నికల్ సింపోజియంలో భాగంగా సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో నిర్మాణ్, ఎలక్ట్రికల్ విభాగంలో టెక్నోస్పైర్, ఎలక్ట్రానిక్ ఇంజనీరింగ్ విభాగంలో ఆక్సెస్, మెకానికల్ విభాగంలో మెకరినా, కంప్యూటర్ సైన్స్ విభాగంలో ఇన్ఫినిట్, మైనింగ్ విభాగంలో ఇగ్నైట్, బయోమెడికల్ విభాగంలో మెడిటెక్ 2024 పేర్లతో విద్యార్థులు టెక్నికల్ సింపోజియంలను నిర్వహించారు. కాగా రెండు రోజులపాటు జరిగే సింపోజియం ఉత్సవాల్లో ఓయూలోని ఏడు ఇంజనీరింగ్ విభాగాలకు చెందిన విద్యార్థులు తమలో ఉన్న సృజనాత్మక శక్తిని వెలికితీసి రూపొందించిన నమూనాలను ప్రదర్శనల్లో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొ.శ్రీరామ్ వెంకటేష్, యూజీసీ డీన్ మల్లేశం, ప్రొ.ముంగు నాయక్, ప్రొ.రామకృష్ణ, ప్రొ.చంద్రశేఖర్ రెడ్డి, స్టూడెంట్ కౌన్సిలర్ లు శ్రీనాథ్, అనురాగ్, శశాంక్ రెడ్డి, సాయి, విజయ్‌కుమార్, సుజిత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇంటికో ఇంకుడుగుంత తప్పనిసరి

● మల్కాజిగిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్
● ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు

మచ్చబొల్లారం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ జలదినోత్సవం సందర్భంగా అల్వాల్ సర్కిల్ మచ్చబొల్లారం డివిజన్ వీబీఆర్ గార్డెన్‌లో సామాజిక కార్యకర్త భోగ విష్ణుమూర్తి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మల్కాజిగిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ ప్రతి నీటి బొట్టును ఒడిసి పట్టాలని, నీటిని వృథా చేయరాదని సూచించారు. వర్షపునీరు వృథా అవకుండా ఉండటానికి ప్రతి ఇంటిలో ఇంకుడుగుంత తప్పనిసరిగా ఉండాలని కోరారు. సామాజిక కార్యకర్త భోగ విష్ణుమూర్తి మాట్లాడుతూ నీటి చుక్క కూడా వృథా కానివ్వకుండా చూడాలన్నారు. ప్రతి ఒక్కరూ ప్రకృతిని ఆస్వాదిస్తూ, ప్రకృతితో మమేకం అవ్వాలని అన్నారు. కాలుష్య నియంత్రణకు ఎవరికి వారు సైకిళ్లను వాడాలని, బైక్, కార్లను అవసరం ఉంటే తప్ప వాడవద్దని కోరారు. ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలను నాటాలని, ప్రకృతిని కాపాడుకున్నట్లైతే భవిష్యత్ తరాలకు మంచి చేసినవారమవుతామని, ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో ముందుకుపోవాలని సూచించారు. ఇట్టి కార్యక్రమంలో యోగి వేమన శాఖ వారు శ్రీనివాస్, కృష్ణ, నరసింహారెడ్డి, సీతారామ్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, దశరథ్, మహేష్, పర్యావరణ సమితి నుంచి మల్లికార్జున్, శంకర్‌గౌడ్, శివారెడ్డి, శ్రీనివాస్‌రావు, వినయ్, కేశవ్ రావు, అల్వాల్ హిల్స్ కాలనీ అధ్యక్షులు భూపాల్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, కిషన్, మురళీధర్‌రెడ్డి, రామ్‌గోపాల్ తదితరులు పాల్గొన్నారు.


నీటిబొట్టును ఒడిసిపట్టాలని కోరుతూ సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న ఈటల రాజేందర్, భోగ విష్ణుమూర్తి

ప్రతి నీటి బిందువును ఒడిసిపట్టుకోవాలి

మౌలాలి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ప్రతి నీటి బిందువును ఒడిసిపట్టుకోవాలని, అందులో భాగంగా ఇంకుడుగుంతల పునరుద్ధరణను ప్రతి ఇంట్లో చేపట్టాలని, అప్పుడే భూగర్భజలాల పెంపు సాధ్యం అవుతుందని గౌతంనగర్ సెక్షన్ మేనేజర్ నవీన్ పేర్కొన్నారు.

శుక్రవారం ప్రపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకొని జలమండలి కార్యాలయ ప్రాంగణంలో ఉన్న ఇంకుడుగుంతను పునరుద్ధరించుతూ మేనేజర్ నవీన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలలో ఇంకుడుగుంతను ఏర్పాటు చేసుకోవాలని, అప్పుడే నీటి ఎద్దడిని నివారించడంతోపాటు భూగర్భ జలాలను పునరుద్ధరించుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో జలమండలి సిబ్బంది కరుణాకర్, మురళి, సరళ, సంతోష్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.


ఇంకుడుగుంత పునరుద్ధరణ పనులను పరిశీలిస్తున్న జలమండలి మేనేజర్ నవీన్

ఈసీహెచ్ఎస్ పాలిక్లినిక్‌లో రిజిస్ట్రేషన్-కమ్-సీనియర్ వెటరన్ కన్సల్టేషన్ అండ్ ఫెసిలిటేషన్ సెంటర్ ప్రారంభం

అల్వాల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఎక్స్-సర్వీస్ మెన్ కాంట్రిబ్యూటరీ హెల్త్ స్కీమ్ (ఈసీహెచ్ఎస్) పాలిక్లినిక్ సికింద్రాబాద్ తిరుమలగిరిలో రిజిస్ట్రేషన్-కమ్ - సీనియర్ వెటరన్ కన్సల్టేషన్ అండ్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను శుక్రవారం జనరల్ ఆఫీసర్ కమాండింగ్, మేజర్ జనరల్ రాకేష్ మనోచా ప్రారంభించారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ సర్కిల్ ద్వారా ప్రీ-ఫ్యాబ్రికేటెడ్ పెవిలియన్ నిర్మించారు. ఈ సందర్భంగా రాకేష్ మనోచా మాట్లాడుతూ తెలంగాణ, ఆంధ్రా సబ్ ఏరియా హెడ్‌క్వార్టర్ నిత్యం మాజీ సైనికులు, సీనియర్ అధికారుల ఆరోగ్య పరిరక్షణ పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందన్నారు. ఎక్స్-సర్వీస్‌మెన్ కాంట్రిబ్యూటరీ హెల్త్ స్కీమ్ (ఈసీహెచ్ఎస్)లో మాజీ సైనికులు, వారితో పాటు ఆధారపడిన వారికి నాణ్యమైన వైద్యసేవలను అందించడానికి మరిన్ని మెరుగైన సౌకర్యాలను కల్పిస్తున్నామన్నారు. సికింద్రాబాద్ తిరుమలగిరిలోని ఈసీహెచ్ఎస్ పాలిక్లినిక్‌లో సుమారు 85 వేల మంది లబ్ధిదారులకు సమర్థవంతంగా వైద్య సేవలను అందిస్తున్నామని ఈ సందర్భంగా మేజర్ జనరల్ రాకేష్ మనోచా వెల్లడించారు.


ఫెసిలిటేషన్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మేజర్ జనరల్ రాకేష్ మనోచా, ఎస్‌బీఐ అధికారులు

ఘనంగా ఎయిర్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ గ్రాడ్యుయేషన్ వేడుకలు

● రాడార్ కంట్రోలర్స్ పట్టభద్రులుగా 8 మంది

అల్వాల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో 147 వ ఎయిర్ ట్రాఫిక్ సర్వీసెస్ సర్వీసెస్ (ఏటీఎస్ఎస్), 111 ఎయిర్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ అండ్ ఎయిర్ లా (జేఏటీ) కోర్సును విజయవంతంగా పూర్తి కావడంతో శుక్రవారం ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ ఆఫీసర్స్ ట్రైనింగ్ ఎస్టాబ్లిష్‌మెంట్ (ఏటీవోటీఈ) గ్రాడ్యుయేషన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అకాడమీ కమాండెంట్ ఎయిర్‌మెన్ మార్షల్ డీఎస్ జోషి ముఖ్యఅతిథిగా పాల్గొని శిక్షణలో ప్రతిభ కనపరిచిన వారికి ట్రోఫీలను అందజేశారు. మూడు నెలలపాటు నిర్వహించిన ఎయిర్ ట్రాఫిక్ సర్వీసెస్ సర్వీసెస్ కోర్సు, ఎయిర్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ కోర్సులో భారత వైమానిక దళానికి చెందిన అధికారులు, భారత నేవీ, ఇండియన్ కోస్ట్ గార్డ్‌కు చెందిన మొత్తం 8 మంది రాడార్ కంట్రోలర్లుగా పట్టభద్రులయ్యారు. ఇండియన్ నేవీ, కోస్ట్‌గార్డ్, హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్, మిత్రదేశాలకు చెందిన వారికి ఇక్కడ శిక్షణ అందిస్తున్నారు.


ఎయిర్ ట్రాఫిక్ సర్వీసెస్ సర్వీసెస్ అవార్డు గ్రహీతలతో ఎయిర్‌మెన్ మార్షల్ డీఎస్.జోషి

కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య

● వివాహం జరిగిన 10 నెలలకు ఆత్మహత్య చేసుకున్న కవితారెడ్డి

అల్వాల్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో ఓ మహిళ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. అల్వాల్ ఇన్‌స్పెక్టర్ సురేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... సిద్దిపేట జిల్లా చేర్యాలలోని చిట్యాల ప్రాంతానికి చెందిన సురేందర్ రెడ్డి కుమారు కవితారెడ్డి(28)ని గత ఏడాది 2023లో సిద్దిపేట జిల్లా తొగుట ప్రాంతానికి చెందిన మధుసూదన్‌రెడ్డికి ఇచ్చి ఘనంగా వివాహం చేశారు. మధుసూదన్‌రెడ్డి ఒక ప్రముఖ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తుండగా, కవిత కిమ్స్ ఆస్పత్రిలో అడ్మిన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. అల్వాల్ భూదేవినగర్ కాలనీలోని ఎంహెచ్ఆర్ కాలనీలో అద్దెకు ఉంటున్నారు. భర్త మధుసూదన్‌రెడ్డి తన తల్లికి అనారోగ్యంగా ఉండటంతో ఆమెకు తోడుగా ఉండటానికి రెండురోజుల క్రితం తన గ్రామం తొగుటకు వెళ్లాడు. ఆస్పత్రిలో విధులు ముగించుకుని ఇంటికి వచ్చిన కవిత భర్త లేకపోవడంతో కాలక్షేపం కోసం ఆమె ఇంటికి సమీపంలో ఉండే తన భర్త మధుసూదన్‌రెడ్డి సోదరి తాటిపర్తి కల్పనారెడ్డి ఇంటికి వెళ్లి అక్కడే భోజనం చేసి రాత్రి పడుకుంది. అనంతరం శుక్రవారం ఉదయం లేచిన కవిత ఆఫీస్‌కు వెళ్లాలని తన ఆడపడుచు కల్పనకు చెప్పి ఉదయం 6-30కు తన ఇంటికి వచ్చింది. ఇంట్లోకి వచ్చిన కవిత ఉదయం 8-30 గంటలు అవుతున్నా తలుపులు తీయలేదు. దీంతో అనుమానం వచ్చిన మధుసూదన్‌రెడ్డి సోదరి కల్పనారెడ్డి తన భర్తతోపాటు స్థానికుల సహాయంతో కిటికీ తెరిచి చూడగా అప్పటికే కవిత ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. దీంతో వారు అల్వాల్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కిందికి దింపి పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కుటుంబ కలహాల కారణంగానే కవిత ఆత్మహత్యకు పాల్పడినట్టు తెలుస్తున్నది.


భర్త మధుసూదన్‌రెడ్డితో కవితారెడ్డి (ఫైల్)

ఆస్తిపన్ను వసూలుకు స్పెషల్ డ్రైవ్

● మొత్తం టార్గెట్ రూ.65 కోట్లు
● ఇప్పటి వరకు రూ.47 కోట్లు వసూలు
● సమీపిస్తున్న చెల్లింపు గడువు

కాప్రా, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ కాప్రా సర్కిల్‌లో ఆస్తిపన్ను వసూళ్లను అధికారులు వేగవంతం చేశారు. చెల్లింపు గడువు సమీపిస్తుండడంతో అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకోసం సర్కిల్‌లో స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. కాప్రా, ఏఎస్‌రావునగర్, చర్లపల్లి, హెచ్‌బీ కాలనీ, మల్లాపూర్, నాచారం డివిజన్లలో ఈ స్పెషల్ డ్రైవ్ కొనసాగుతోంది. ఎల్బీనగర్ జోనల్ కమిషనర్, సర్కిల్ డీసీ ముకుందరెడ్డి, సర్కిల్ సూపర్‌వైజరీ అధికారి సరోజ ఆదేశాలతో ఏఎంసీలు, వార్డు అధికారులు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లు స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొని ప్రతిరోజు నిర్దేశించిన ఆస్తి పన్ను వసూలు చేస్తున్నారు. సర్కిల్‌లో మొత్తం 78,235 అసెస్‌మెంట్లు ఉన్నాయి. ఇందులో రెసిడెన్షియల్ 68,775, కమర్షియల్ 9,460 ఉన్నాయి. ఆయా అసెస్‌మెంట్ల నుంచి మొత్తం రూ.65కోట్ల ఆస్తిపన్ను వసూలు చేయాలని జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు సర్కిల్‌కు టార్గెట్ విధించారు. ఈ రోజు శుక్రవారం వరకు రూ.47కోట్లు వసూలయ్యాయి. ఎర్లీబర్డ్ ఆఫర్ కింద గత ఏప్రిల్ నెలలో ఆస్తిపన్ను చెల్లించిన వారికి ఐదు శాతం రాయితీ ఇవ్వడంతో బడా సంస్థలు, ప్రజల నుంచి ఆ ఒక్క నెలలోనే రూ.26కోట్లు ఆస్తిపన్ను వసూలైంది. ఇక పన్ను బకాయిల వడ్డీపై 90శాతం రాయితీ ఇచ్చే వన్ టైమ్ సెటిల్‌మెంట్ (ఓటీఎస్) స్కీమ్‌ను ప్రభుత్వం ప్రకటించింది. దీని ద్వారా రూ.21కోట్ల ఆస్తిపన్ను వసూలవుతుందని అధికారులు భావించగా ఈ రోజువరకు రూ. 3.32 కోట్లు మాత్రమే వచ్చాయి. మొత్తం టార్గెట్‌లో రూ.47కోట్లు వసూలవగా మిగిలిన రూ.18 కోట్ల వసూలు చేసేందుకు అధికారులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఈనెల 31తో ఆస్తిపన్ను చెల్లింపు గడువు ముగుస్తుండడంతో ఉన్నతాధికారులు రోజూ సమీక్షలు నిర్వహించి, రెవెన్యూ అధికారులకు దిశా నిర్దేశం చేస్తున్నారు. ప్రతిరోజు రూ.60లక్షలు వసూలు చేయాలని టార్గెట్ విధించారు. సెలవు దినాలలో సర్కిల్ కార్యాలయంలో ఆస్తిపన్ను పరిష్కార వేదికలు నిర్వహించి సంబంధిత సమస్యలు పరిష్కరిస్తున్నారు. సర్కిల్ కార్యాలయం, వార్డు కార్యాలయాలలో ఆస్తి పన్ను చెల్లింపు కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఆన్‌లైన్ ద్వారా కూడా పన్ను చెల్లించవచ్చని అధికారులు సూచిస్తున్నారు.


కాప్రా సర్కిల్ కార్యాలయం

ఓటీఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ఓటీఎస్ స్కీమ్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. ఈనెల 31లోగా పన్నులు చెల్లించిన వారికి బకాయిల వడ్డీపై 90 శాతం రాయితీ లభిస్తుంది. ఆస్తిపన్నుకు సంబంధించిన సమస్యలుంటే పరిష్కార వేదిక దృష్టికి తీసుకురావాలి. సర్కిల్‌లో ఇప్పటికే 80 శాతం పన్నులు వసూలు చేశాం. గడువులోగా టార్గెట్‌ను అధిగమిస్తాం. పన్నులు చెల్లించకుండా మొండికేసేవారిపై చర్యలు తప్పవు. ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి సర్కిల్ అభివృద్ధికి తోడ్పాటునందించాలి.

- వి.ముకుందరెడ్డి, ఇన్‌చార్జి జెడ్సీ, కాప్రా డీసీ




సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన కమ్మ సంఘం నాయకులు

కమ్మ కార్పొరేషన్ ఏర్పాటుపై సీఎంకు కృతజ్ఞతలు

ఉప్పల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కమ్మ కార్పొరేషన్ ఏర్పాటు చేయడంపై కమ్మవారి వెల్ఫేర్ అసోసియేషన్ హబ్సిగూడ ప్రెసిడెంట్ పోలవరపు శివప్రసాద్ శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కమ్మ సామాజికవర్గానికి ఒక పార్లమెంట్ స్థానం కేటాయించాలని ఆయన మంత్రి తుమ్మల నాగేశ్వరావు, రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరికి కలిసి ఎంపీ సీటు కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మేడ్చల్ టౌన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కుత్బుల్లాపూర్ సంజయ్‌గాంధీ నగర్‌కు చెందిన ఆషిక్ (28) వృత్తిరీత్యా వెల్డర్. తన ద్విచక్ర వాహనంపై గుండ్లపోచంపల్లి చౌరస్తా నుంచి మేడ్చల్ వైపు వస్తుండగా ఓఆర్ఆర్ సమీపంలోని కండ్లకోయ గౌడవెల్లి చౌరస్తా వద్ద ఎదురుగా వస్తున్న డీసీఎం వాహనం ఢీకొంది. దీంతో ఆషిక్‌కు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం అతనిని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆషిక్ మృతి చెందాడు. మృతుని కుటుంబ సభ్యులు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

జవహర్‌నగర్ సమస్యలను పరిష్కరించాలి

కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్‌యాదవ్

జవహర్‌నగర్, మార్చి, 22 (ఆంధ్రజ్యోతి): పేదలు, బడుగు బలహీనవర్గాలు ఎక్కువగా ఉంటున్న జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు ఇక్కడి సమస్యలు పరిష్కరించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కోరినట్లు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్ యాదవ్ తెలిపారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రిని కలిసి జవహర్‌నగర్ సమస్యలను వివరించినట్లు తెలిపారు. ఇక్కడి ముఖ్యంగా 100 పడకల ఆస్పత్రి, యువత కోసం క్రీడామైదానం, గ్రంథాలయం ఏర్పాటు చేయాలని, జీవో 58,59లో ఎన్నో అవకతవకలు ఉన్నాయని ఇందులో ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చూడాలన్నారు. ఇళ్లను క్రమబద్ధీకరించాలని కోరినట్లు తెలిపారు. దంపింగ్‌యార్డ్‌కు వస్తున్న వ్యర్థాల భారం ఇతర ప్రాంతాలకు తరలించాలని, దంపింగ్‌యార్డ్ ఇబ్బందుల నుంచి ప్రజలకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరినట్లు తెలిపారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో జవహర్‌నగర్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్రీ లలితా సహస్రనామం బోధన

మచ్చబొల్లారం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని గురుకుల విద్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం 7గంటలకు శ్రీ లలిత సహస్రనామం గురించి వివరణ కార్యక్రమాన్ని ఉచితంగా నిర్వహిస్తున్నామని గురుకుల విద్య ఫౌండేషన్ వారు తెలిపారు. శ్రీ లలిత సహస్రనామాలను యాంత్రికంగా వల్లిస్తే ఉపయోగం పెద్దగా ఉండదని, ప్రతి నామానికి గల అంతరార్థ, పరమార్థాలను గ్రహించి మనసు చేసుకుంటూ చదవడం ఒక్కటే మార్గమని, ఇందుకే ఈ నామాలను లలిత రహస్య సహస్ర నామాలంటారని వారు తెలిపారు. ఈ కార్యక్రమం జూమ్ ద్వారా ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నామని, మరిన్ని వివరాలకు 7207783336 నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

రేపు జేజేనగర్ సొసైటీ సర్వసభ్య సమావేశం

నేరేడ్‌మెట్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): నేరేడ్‌మెట్ డివిజన్ పరిధిలోని జేజేనగర్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్ సర్వసభ్య సమావేశం ఈనెల 24వ తేదీ ఆదివారం ఉదయం పదిన్నర గంటలకు నిర్వహిస్తున్నట్లు సొసైటీ అధ్యక్షుడు డి.లక్ష్మీనారాయణరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎజెండా అంశాలైన వెల్‌కమ్ అడ్రస్, సొసైటీ అధ్యక్షుని అడ్రస్, ప్రధాన కార్యదర్శి రిపోర్టు తదితర అంశాలపై చర్చలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు. ఇతర విషయాల గురించి చర్చించాలనుకొనేవారు చైర్మన్ అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. సభ్యులు సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు.

ఐలమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

మౌలాలి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని మౌలాలి డివిజన్ కార్పొరేటర్ గున్నాల సునీత డిమాండ్ చేశారు. శుక్రవారం గౌతంనగర్ డివిజన్ జ్యోతినగర్ పార్కు స్థలంలో ఏర్పాటుచేసిన చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేయడంపై బీజేపీ నాయకులు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా రజక సంఘ కార్యవర్గ సభ్యుడు వీకే మహేష్ ముదిరాజ్, కార్పొరేటర్ గున్నాల సునీతయాదవ్ మాట్లాడుతూ నిందితులను వెంటనే గుర్తించి శిక్షించాలన్నారు. అనంతరం రజక సంఘ ప్రతినిధులు అందరు కలిసి విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమంలో రజక సంఘ ప్రతినిధులు కిరణ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రసాయనాలతో అల్లం వెల్లుల్లి పేస్ట్

1300 కిలోల కల్తీ పేస్ట్‌ను స్వాధీనం చేసుకున్న అధికారులు : ఒకరి అరెస్టు

హైదరాబాద్ సిటీ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : రసాయనాలు కలిపి కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్‌ను తయారుచేసి విక్రయిస్తున్న వ్యక్తిని ఫుడ్ సేఫ్టీ, ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు కలిసి అరెస్ట్ చేశారు. లాలాపేట జనప్రియ అపార్ట్‌మెంట్స్‌కు చెందిన నీల వెంకటేశ్వర్లు (54) గతంలో అల్లం వెల్లుల్లి పేస్ట్ చేసి దుకాణాలకు సరఫరా చేసేవాడు. వ్యాపారంలో వచ్చిన డబ్బులు అవసరాలకు సరిపోకపోవడంతో, టైటానియం డయాక్సైడ్, క్సాంతం గమ్ కలిపి కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్‌ను తయారు చేశాడు. మంచి అల్లం, వెల్లుల్లి కలిపి తయారు చేశానని చెబుతూ నగరంలో పలు దుకాణాలకు సరఫరా చేస్తున్నాడు. ఇతడి దందాపై పక్కా సమాచారమందుకున్న ఫుడ్‌సేఫ్టీ, టాస్క్‌ఫోర్స్ పోలీసులు కలిసి లాలాపేటలోని ఇతడి తయారీ కేంద్రంపై దాడి చేశారు. అతడి వద్ద రూ. 1.70 లక్షల విలువైన 1300 కిలోల కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్, 20 కిలోల టైటానియం డయాక్సైడ్, క్సాంతం గమ్‌లను స్వాధీనం చేసుకున్నారు.

పశుపోషణ, వ్యవసాయ రంగాలలో పరిశోధనలను విస్తృత పరచాలి


సదస్సులో శాస్త్రవేత్తలు

రాజేంద్రనగర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పశుపోషణ, వ్యవసాయ రంగాలలో పరిశోధనలను విస్తృతపరచాలని, ప్రతి విద్యార్థి ఒక పారిశ్రామికవేత్తగా మారడానికి కృషి చేయాలని తమిళనాడు మాజీ చీఫ్ సెక్రెటరీ, ఇండియన్ పొటాష్ లిమిటెడ్, సెంటర్ ఫర్ రూరల్ బయోటెక్ డైరెక్టర్ డాక్టర్ రాజీవ్ రంజన్ శాస్త్రవేత్తలకు పిలుపునిచ్చారు. పీవీ నర్సింహారావు తెలంగాణ రాష్ట్ర పశువైద్య విశ్వవిద్యాలయం, రాజేంద్రనగర్ పశువైద్య కళాశాల, పశుసంవర్థక విస్తరణ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం రాజేంద్రనగర్‌లోని విస్తరణ విద్యానంద ఆడిటోరియంలో సుస్థిర పాడి పశువుల ఉత్పాదకత పెంపొందించడానికి సమగ్ర పోషణ యాజమాన్య పద్ధతులు అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమం పశువైద్య విస్తరణ విభాగం అధిపతి ప్రొఫెసర్ సీహెచ్.సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది.